www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 213 | శనివారం 03.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

## ఇక బండి సీజ్

పెండింగ్ చలాన్లపై సుప్రీం సీరియస్

### చలాన్లు బాకీ ఉంటే ఆన్‌లైన్ సేవలు బంద్



- చలాన్లు పెండింగ్.. వాహనదారులకు షాక్
- బాకీ చలాన్లపై ఇక కఠిన నిబంధనలు
- పెండింగ్ చలాన్లు ఉంటే వాహనమే టార్గెట్
- ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఇక కఠిన శిక్షలు
- బకాయి చలాన్లతో వాహన సేవలు బంద్
- వాహనదారులారా.. చలాన్లు క్లియర్ చేసుకోండి

02

## నీ ధైర్యసాహసాలకు దేశం గర్విస్తోంది..

### కెప్టెన్ మచ్చార్ ధైర్యానికి ప్రధాని ప్రశంసలు



- ఆపదలో సమయస్ఫూర్తి.. ప్రయాణికులకు రక్షణ
- తన ప్రాణాలకంటే ప్రయాణికుల ప్రాణాలే ముఖ్యం
- కాక్‌పిట్‌లో పోరాటం.. పెను ప్రమాదం తప్పింది
- సాహసోపేత నిర్ణయంతో వందల ప్రాణాలకు రక్షణ

05



## మెట్రో, ఆర్టీసీలకు కామన్ పాస్

25 లక్షల బస్సు ప్రయాణికులకు ప్రయోజనం

లాస్ట్‌మైల్ కనెక్టివిటీకి కొత్త ఊతం

### బస్సు దిగగానే మెట్రోకు అదే పాస్

రోజువారీ పాస్ ధర రూ.400, నెలవారీ పాస్ రూ.8,500గా నిర్ణయించారు. ఈ పాస్‌తో లక్షలాది బస్సు, మెట్రో ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. ప్రజా రవాణాను ఏకీకృతం చేసి, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది.

- హైదరాబాద్ ప్రయాణికులకు ఇక స్మార్ట్ జర్నీ
- ప్రజా రవాణాలో రెండు సర్వీసులకు ఒకే పాస్
- మెట్రో ఎక్కాలంటే మరో టికెట్ అక్కర్లేదు
- బస్సు దిగగానే మెట్రోకు అదే పాస్
- ప్రయాణికుల సమయం.. ఖర్చుకు కొత్త ఊరట
- సిటీ జర్నీకి కామన్ పాస్‌తో సౌలభ్యం
- హైదరాబాద్ రవాణా వ్యవస్థలో మరో ముందడుగు
- మెట్రో–బస్సు ప్రయాణానికి సింగిల్ పాస్
- సిటీ ట్రాన్స్‌పోర్ట్‌లో ఇంటిగ్రేషన్‌కు శ్రీకారం
- రోజువారీ ప్రయాణికులకు కామన్ పాస్ వరం
- బస్సు నుంచి మెట్రోకు సులువైన కనెక్టివిటీ

02

## 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి

కిచెన్ నిర్మాణాలకు రెండు సంస్థలు రూ.9.17 కోట్లు విరాళం



# విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్..

## ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త వెలుగులు

- బడిపిల్లల ఆరోగ్యానికి సర్కార్ పెద్దపీట
- విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కీలక నిర్ణయం
- ప్రభుత్వ బడుల్లో పిల్లలకు పౌష్టిక అల్పాహారం
- విద్యార్థుల ఆరోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ
- బడిపిల్లల భవిష్యత్తుకు సర్కార్ భరోసా
- పౌష్టికాహారంతో విద్యార్థులకు మరింత బలం
- ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త వెలుగులు
- విద్యార్థుల ఆరోగ్యం.. చదువుపై సర్కార్ ఫోకస్
- బడిపిల్లల కోసం ఆధునిక సెంట్రల్ కిచెన్లు
- పిల్లల సంక్షేమానికి ప్రభుత్వ కొత్త అడుగు
- పౌష్టిక అల్పాహారంతో బడులకు కొత్త ఊపు
- విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ
- సర్కార్ బడుల్లో ఆరోగ్యకరమైన ఉదయానికి శ్రీకారం

05

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం) ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు ...



## టీఎన్జీవోల హర్షం

51 శాతం ఫిట్‌మెంట్‌తో కొత్త పే స్కేళ్లు
పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని విజ్ఞప్తి
హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కరించాలన్న టీఎన్జీవోలు

02

## యువ ఓటర్లే టార్గెట్..

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

ఫారమ్-6తో కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

యువత నమోదుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యాచరణ





- కొత్త ఓటర్ల నమోదుకు ఈసీ ప్రత్యేక డ్రైవ్
- ఓటర్ల జాబితాలో పేర్ల కోసం ఇంటింటి సర్వే
- యువ ఓటర్ల నమోదుపై ఈసీ ప్రత్యేక దృష్టి
- ఎస్ఐఆర్ తర్వాత మిస్సైన ఓటర్లపై ఫోకస్
- ఓటు హక్కు కోసం బూత్ స్థాయి క్యాంపులు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు
- ఫారమ్-6తో కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

03

పేర్లు గల్లంతైన ఓటర్లపై ఈసీ ఫోకస్



## జెన్ నెక్స్ట్ ముంబయి ఆందోళన..

- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో దేశవ్యాప్త నిరసనలు
- ముంబయిలో పరస్పర ఆందోళనలతో రాజకీయ వేడి
- సీజేపీ నిరసనలకు వ్యతిరేకంగా యువత ఆందోళన
- ఎన్నికల సంఘంపై నిరసన.. ముంబయిలో ఉద్రిక్తత
- రాజ్యాంగ పరిరక్షణ పేరుతో సీజేపీ ఆందోళనలు

02

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. గాంధీ జయంతి సందర్భంగా ఇవాళ ఢిల్లీలోని జంతర్ మంతర్, ముంబయిలోని శివాజీ పార్క్ పరిసరాల్లో నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా ముంబయిలో సీజేపీ వ్యవస్థాపకుడు అబిజీత్ దీప్కే నేతృత్వంలో ఆందోళనలు కొనసగగా కాక్రోచ్ జనతా పార్టీకి వ్యతిరేకంగా మరో ఆందోళన మొదలైంది.

## నాకే ఎమ్మెల్యే పదవి వస్తుంది..!



- ఎన్నికల పిటిషన్ తీర్పుపైనే ఉత్కంఠ
- ఉపఎన్నికకు ముందే పిటిషన్‌పై తీర్పు కోరుతూ పిటిషన్
- దానం అనర్హతతో ఖైరతాబాద్‌లో రాజకీయ వేడి
- ఉపఎన్నిక వస్తే అధిష్ఠానం నిర్ణయమే కీలకం

03





## ఏఐ సాంకేతికతకు రాజ్యాంగ విలువలే రక్ష

- టెక్నాలజీతో న్యాయవ్యవస్థలో వేగం పెరగాలి
- సాంకేతికత మారినా విలువలు మారొద్దు

05



## ఖైరతాబాద్ లో గెలిచేది మేమే

ఫామ్‌హౌజ్‌కే పరిమితం... గాంధీ, అంబేద్కర్ జయంతులు కూడా పట్టించుకోరు

### డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- ఖైరతాబాద్‌లో 32 వేల ముస్లిం ఓట్లపై కన్నేసిన కాంగ్రెస్
- 2 లక్షల హిందూ ఓటర్లను ఏకం చేస్తాం... బీజేపీని గెలిపిస్తాం
- కాంగ్రెస్-బీఆర్ఎస్ ఒక్కటైనా... ప్రజలు బొంద పెడతారు
- గాంధీ ఆశయాలే కేంద్రంగా రాజకీయ విమర్శలు
- డబ్బు, అధికారం కోసం ఆరాటపడని... రామ్... రామ్ అంటూ జీవించిన పావనమూర్తి

02

# పథకాన్ని నీరుగార్చొద్దు...

## తులం బంగారం హామీ ఏమైందన్న హరీశ్

### కళ్యాణలక్ష్మి బకాయిలపై బీఆర్ఎస్ పోరుబాట

కళ్యాణలక్ష్మి 12 ఏళ్లు.. హామీలపై కొత్త రాజకీయ దుమారం

పేద ఆడబిడ్డలకు న్యాయం చేయాలన్న హరీశ్



- కళ్యాణలక్ష్మి పథకాన్ని నీరుగార్చొద్దన్న హరీశ్
- పెండింగ్ దరఖాస్తులపై ప్రభుత్వాన్ని నిలదీసిన హరీశ్
- పేద ఆడబిడ్డలకు న్యాయం చేయాలన్న హరీశ్
- కళ్యాణలక్ష్మి బకాయిలపై బీఆర్ఎస్ పోరుబాట
- కాంగ్రెస్ హామీలపై హరీశ్ రావు ఫైర్
- తులం బంగారం హామీ ఏమైందన్న హరీశ్
- పేదింటి ఆడబిడ్డల పథకంపై రాజకీయ వేడి
- లక్ష సాయం.. తులం బంగారం హామీపై రగడ

03

# జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్య పోరాటం అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు





**హైదరాబాద్ , ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** IJU జాతీయ కమిటీ, TUWJ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలో భాగంగా, హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ వద్ద అక్టోబర్ 2న నిర్వహించిన నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన పత్రికా సంస్థల అధినేతలు, సంపాదకులు, జర్నలిస్టులు, మీడియా మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు.జర్నలిస్టుల హక్కులు, గౌరవం, భద్రత, సంక్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మీరు చూపిన ఐక్యత, నిబద్ధత, పోరాట స్ఫూర్తి అభినందనీయం.ఒక్కరి సమస్య అందరి సమస్యగా భావించి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.మీ అమూల్యమైన సహకారం, భాగస్వామ్యం ఈ కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూర్చింది. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఇదే ఐక్యతతో ముందుకు సాగుదాం.

# ఖైరతాబాద్ లో గెలిచేది మేమే

**జమ్మికుంట,ఫ్లాష్ ఇండియా :** మహాత్మా గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని జమ్మికుంటలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మికుంటలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. “శ్రీరాముడు సంపన్నుల దేవుడు” అని వ్యాఖ్యానించిన కాంగ్రెస్ నాయకులకు, సీఎం రేవంత్ రెడ్డికి ఆయన పదునైన ప్రశ్నలు సంధించారు. ఒంటిపై గోచీ తప్ప ఏమీ లేకుండా కటిక నేలపై నిద్రించిన మహాత్మా గాంధీ నిత్యం రామనామాన్నే జపించారని, మరి గాంధీజీ పూజించిన శ్రీరాముడు సంపన్నుల దేవుడా లేక ప్రజలంతా ఆరాధించే దైవమా అని నిలదీశారు. సత్యం, ధర్మం, న్యాయమే మార్గంగా బతికిన మహాత్మా గాంధీ అసలు సిసలైన హిందూ సనాతన ధర్మాన్ని ఆచరించారని బండి సంజయ్ పేర్కొన్నారు. గాంధీజీ ఏనాడూ పదవులను, కుటుంబ వారసత్వాన్ని లేదా అవినీతిని ప్రోత్సహించలేదని చెప్పారు. మహాత్ముడు కలలు కన్న, రాజు-పేద తేడా లేని 'రామరాజ్యాన్ని' ఆచరణలో చూపిస్తూ, స్వచ్ఛ భారత్ ఉద్యమంతో ఆయన ఆశయాలను నిజం చేస్తున్న నరేంద్ర మోడీ, బీజేపీలే గాంధీజీకి నిజమైన వారసులని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీని “ఇటలీ నేషనల్ కాంగ్రెస్”గా అభివర్ణిస్తూ, అది డూప్లికేట్ గాంధీ కుటుంబం చేతిలో ఉందని, అవినీతి, కుటుంబ రాజకీయాలు, హిందుత్వ ద్వేషమే ధ్యేయంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.

**ప్రపంచంలో కేసీఆర్ ఒక్కరే..**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫాంహౌజ్‌కే పరిమితమవుతూ గాంధీ, అంబేద్కర్ వంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఓడిపోతే ప్రజల్లో ఉండకుండా ఫామ్‌హౌజ్‌లో సేద తీరే నాయకుడు కేసీఆర్ ఒక్కరే అని.. ప్రపంచంలో ఇంత స్వార్థపూరిత నాయకుడు మరొకరు లేరు అని రెచ్చిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు హిందువులను చీల్చే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' (బీజేపీ ప్రభుత్వం) అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో రాబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికకు ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీయే కారణమని మండిపడ్డారు. ఖైరతాబాద్‌లో 32 వేల ముస్లిం ఓట్లు ఉన్నాయని, ఆ ఓట్లతోనే గెలవాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని విమర్శించారు. అయితే అక్కడ 2 లక్షలకు పైగా ఉన్న హిందూ ఓటర్లను విస్మరిస్తున్నారని, ఆ నియోజకవర్గంలోని హిందూ ఓటర్లందరినీ ఏకం చేస్తామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటైనా సరే, ఆ రెండు పార్టీలను ప్రజలు బొంద పెట్టడం ఖాయమని బండి సంజయ్ హెచ్చరించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటు రాబోయే ఎన్నికల్లోనూ బీజేపీని గెలిపించి తీరుతామనీ ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**అసలు ఎవరీ గాంధీ?**

అక్టోబర్ 2న ప్రపంచమంతా గుర్తు చేసుకునే మహాత్మా గాంధీ అసలు ఎవరో ఈ నాటి తరానికి స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది. గాంధీజీ ఏనాడూ డబ్బు కోసం అడ్డదారులు తొక్కలేదు, అధికారం కోసం ఆరాటపడలేదు, తన వెంట సైన్యాన్ని కోరుకోలేదు. ఒంటిపై నూలు పోగు లేకుండా కటిక నేలపై నిద్రించి, చివరి శ్వాస వరకు సామాన్యుడి ప్రతిరూపంగా జీవించిన మహనీయుడు ఆయన. సత్యం, ధర్మం, న్యాయమే ఆయన మార్గం. 'నేను హిందువుని' అని గర్వంగా చెప్పుకుంటూ, ఇతర మతాలలోని మంచిని గౌరవించే భారతీయ సనాతన ధర్మాన్ని ఆచరించిన గొప్ప వ్యక్తి. తన జీవితాంతం పెదవులపై 'రామ్... రామ్... జై శ్రీరామ్' అంటూ రామనామాన్ని జపించిన గాంధీజీకి, శ్రీరాముడంటే సత్యం, ధర్మం, న్యాయం, మనిషి ఆచరించాల్సిన జీవిత విలువలు. ఏనాడూ పదవులను, కుటుంబ వారసత్వాన్ని ప్రోత్సహించని అసలు సిసలైన పావనమూర్తి మహాత్మా గాంధీ అని బండి సంజయ్ కొనియాడారు.



## గ్రామాలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మహాదేవపురం మండలం వివిధ గ్రామపంచాయతీలో శుక్రవారం సర్పంచ్ ల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సర్పంచ్ లు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గారు సత్యం, అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహానుభావుడని తెలిపారు.ఆయన చూపిన మార్గాన్ని యువత అనుసరించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.గ్రామ అభివృద్ధిలో గాంధీజీ కలల గ్రామ స్వరాజ్య భావనను అమలు చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం వీబీజి -రామ్ జి పై గ్రామసభలు నిర్వహించారు.ఇట్టి గ్రామసభలో గ్రామపంచాయతీ అభివృద్ధి గురించి, కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి చర్చించుకున్నారు.ఈ కార్యక్రమమాలలో సర్పంచ్ లు,ఉపసర్పంచ్ లు,కార్యదర్శులు,వార్డ్ సభ్యులు,ఫీల్డ్ అసిస్టెంట్లు,యూత్ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో,ఆర్టీసీలకు కామన్ పాస్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మెట్రో రైల్, ఆర్టీసీ బస్సులకు కామన్ పాస్ ఈరోజు (శుక్రవారం) నుంచి తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ కామన్ పాసుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. హైదరాబాద్‌లో నేటి నుంచి కొత్త ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. టీజీఎస్‌ఆర్‌టీసీ-మెట్రో ఉమ్మడి ట్రావెల్ పాస్ ఇవాళ నుంచి అందుబాటులోకి వస్తోందని వ్యాఖ్యానించారు. అన్ని మెట్రో స్టేషన్లలో కామన్ ట్రావెల్ పాస్‌ను తీసుకువచ్చినట్లు వివరించారు.ఓఆర్ఆర్ పరిధిలోని సిటీ బస్సుల్లో ఈ పాస్ చెల్లుబాటవుతోందని వెల్లడించారు. బస్సు-మెట్రోకు ఇక రెండో టికెట్ అవసరం లేదని తెలిపారు. 25 లక్షలకు పైగా బస్సు ప్రయాణికులకు ఈ కామన్ పాసుతో ప్రయోజనం ఉంటుందని చెప్పుకొచ్చారు. 4.5 లక్షల మెట్రో ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. మెరుగైన లాస్ట్‌మైల్ కనెక్టివిటీపై తాము ఫోకస్ పెట్టామని అన్నారు. ప్రజా రవాణాను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగు వేశామని తెలిపారు. హైదరాబాద్‌ను 'ఫాస్టెస్ట్ సిటీస్'లో ఒకటిగా మార్చడమే క్యూర్ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.కాగా, ఆర్టీసీ బస్ - మెట్రో రైల్ కలిపి రోజు, నెల వారి పాసులను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ జారీ చేసింది. ఆర్టీసీ మెట్రో రైల్ జాయింట్ పాసుతో ఆర్టీసీ బస్సు, మెట్రో రైల్లో ప్రయాణించే సదుపాయం కల్పించింది. రోజు వారి పాస్ రూ.400, నెల వారి పాస్ రూ.8500 ఖరారు చేసింది. ఆర్టీసీ బస్సుల్లో ఆన్‌లైన్ టికెటింగ్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది. కండక్టర్‌తో పని లేకుండా మొబైల్లోనే టికెట్ పొందే సదుపాయం కల్పించింది. ఫిజికల్ టికెట్ అవసరం లేకుండా మొబైల్లోనే టికెట్ పొందే సదుపాయం తీసుకువచ్చింది. వారం రోజుల పాసును సైతం ఆర్టీసీ తీసుకువచ్చింది. మీ టికెట్ యాప్ ద్వారా మొబైల్లోనే రోజు వారి టికెట్, డే పాస్, వారం, నెల వారి బస్ పాసులను పొందే సదుపాయాన్ని రాష్ట్ర సర్కార్ కల్పించింది.

# ఇక బండి సీజ్

**ఢిల్లీ :** ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినప్పుడు పడే చలాన్లను చూసీచూడనట్లు వదిలేస్తున్నారా? 'ఏముందిలే.. తర్వాత చూసుకుందాం' అని నిర్లక్ష్యం చేస్తున్నారా? అయితే ఈ వార్త మీకోసమే. ఇకపై ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా అలాగే వదిలేస్తే బండి జప్తు అవ్వడమే కాకుండా, పెండింగ్ ఫైన్లు ఉన్న వాహనాలకు సంబంధించి దాదాపు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలను నిలిపివేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ, పెండింగ్ ఈ-చలాన్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. కేవలం చలాన్లు విధిస్తే సరిపోదని, వాటిని వసూలు చేయడంలో స్పష్టమైన చర్యలు ఉండాలని జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా జారీ అవుతున్న చలాన్లలో దాదాపు 47 శాతం వరకు పెండింగ్‌లోనే ఉండటంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు ఇకపై అకస్మాత్తుగా రోడ్లపై తనిఖీలు (ర్యాండమ్ చెక్స్) చేసి, పెండింగ్ చలాన్లు ఉన్నట్లు తేలితే ఆ వాహనాలను వెంటనే సీజ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.ఇక, చలాన్లు చెల్లించకపోతే ఎదురయ్యే చిక్కులు మామూలుగా లేవు. బాకీ బకాయిలు తీర్చేవరకు సదరు వాహనాలకు సంబంధించిన పలు ఆన్‌లైన్ సేవలను పూర్తిగా నిలిపివేస్తారు. వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ రెన్యూవల్ చేయడం కుదరదు, నకిలీ ఆర్‌సీ (డూప్లికేట్ ఆర్‌సీ) ఇవ్వరు, అలాగే యజమాని అడ్రస్ మార్చాలన్నా కుదరదు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ నిరాకరించడమే కాకుండా, పరివాహన్ పోర్టల్‌లో ఆ వాహనాన్ని బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. ఇక వాహనాన్ని వేరొకరికి అమ్మాలన్నా లేదా వేరే పేరు మీదకు మార్చాలన్నా (ఓనర్ షిప్ ట్రాన్స్‌ఫర్) కుదరదు. అన్నింటికంటే ముఖ్యంగా, పెండింగ్ చలాన్లు ఉన్న బండ్లకు పొల్యూషన్ సర్టిఫికేట్ కూడా ఇవ్వకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించింది.ఒక్కసారి కాకుండా పదే పదే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే డ్రైవర్లపైనా కఠిన చర్యలకు కోర్టు పిలుపునిచ్చింది. పలుమార్లు నియమాలు ఉల్లంఘించిన వారి డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌ను నిలిపివేయడంతో పాటు, ప్రస్తుతం చెల్లుబాటులో ఉన్న లైసెన్సులను కూడా సస్పెండ్ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-చలాన్లు జారీ చేయడమే తప్ప, పెండింగ్ సొమ్మును వసూలు చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇప్పటివరకు సేకరించిన సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ-చలాన్ల రూపంలో ఏకంగా రూ. 49,194 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు కేవలం రూ. 26,175 కోట్లు మాత్రమే వసూలైంది, మిగతా భారీ సొమ్ము ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయింది. కేవలం కాగితాల మీద చలాన్లు రాయడం కాకుండా, క్షేత్రస్థాయిలో కఠినంగా వ్యవహరించి వసూలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించింది. మోటారు వాహనాల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి 2012లో దాఖలైన ఈ పిటిషన్‌పై దాదాపు 14 ఏళ్లుగా విచారణ జరుగుతోంది. ఇన్ని సంవత్సరాలుగా తాము ఎన్నో ఆదేశాలు ఇస్తున్నా, అవి కేవలం కాగితాలకే పరిమితమైతే సహించేది లేదని, అధికారులు ఇకనైనా మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు తీవ్రంగా హెచ్చరించింది. కాబట్టి రోడ్డుపైకి వెళ్లేటప్పుడు నిబంధనలు పాటించడంతో పాటు, మీ వాహనంపై ఏవైనా పెండింగ్ చలాన్లు ఉంటే వెంటనే క్లియర్ చేసుకోవడం ఎంతైనా మంచిది.



## జెన్ నెక్స్ట్ ముంబయి ఆందోళన..

**ఢిల్లీ :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. గాంధీ జయంతి సందర్భంగా ఇవాళ ఢిల్లీలోని జంతర్ మంతర్, ముంబయిలోని శివాజీ పార్క్ పరిసరాల్లో నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా ముంబయిలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నేతృత్వంలో ఆందోళనలు కొనసగగా కాక్రోచ్ జనతా పార్టీకి వ్యతిరేకంగా మరో ఆందోళన మొదలైంది.'జెన్ నెక్స్ట్ ముంబయి' పేరుతో సీజేపీ వ్యతిరేకంగా యువత ఆందోళనకు దిగారు. జెన్ నెక్స్ట్ ముంబయి నిరసనకారుల్లో ఒకరు మాట్లాడుతూ.. అభిజీత్ దీప్కే వంటి వారు రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం గురించి మాట్లాడుతున్నారని అయితే రాజ్యాంగాన్ని ఎలా కాపాడాలో, దాన్ని ఎలా గౌరవించాలో మాకు తెలుసన్నారు. అందుకే ఇవాళ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం కింద నిలబడి శాంతియుతంగా నిరసన చేపడుతున్నామని, క్రోక్రాచ్ జనతా పార్టీ ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఇదిలా ఉంటే తమ ఉద్యమానికి మద్దతుగా ప్రజలు కలిసి రావాలని సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే, ఆపార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తదితరులు పిలిపునిచ్చారు. దీంతో పరస్పర ఆందోళనలతో ముంబయిలో టెన్షన్ వాతావరణం నెలకొంది.

**నెటిజన్ల రియాక్షన్:**

సీజేపీకి వ్యతిరేకంగా జెన్ నెక్స్ట్ ముంబయి పేరుతో కొత్త ఆందోళన పుట్టుకురావడం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ఈ అంశంపై సోషల్ మీడియాలో నెటిజన్లు పరస్పరం కామెంట్స్ రూపంలో విమర్శలు చేసుకుంటున్నారు. సీజేపీ దిమాగీ నక్స ల్స్ అని జెన్ నెక్స్ట్ ముంబయి మద్దతుదారులు కామెంట్స్ చేస్తుంటే జెన్ నెక్స్ట్ ముంబయి ఆందోళనల వెనుక బీజేపీ ఉందని సీజేపీ సపోర్టర్స్ కామెంట్స్ చేస్తున్నారు. దీంతో సీజేపీ తాజా ఆందోళన ఏ పరిణామాలకు దారి తీయబోతోంది అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది.



## కాళేశ్వరం ఎస్ఐగా ఇష్టబోయిన సురేష్

**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా ఇష్టబోయిన సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం కాళేశ్వరం ఎస్ఐగా విధులు నిర్వహించిన తమాషా రెడ్డికి ఆసిఫాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సురేష్ నియమితులయ్యారు.ఇష్టబోయిన సురేష్ గతంలో భూపాలపల్లి డీసీఆర్‌బీలో విధులు నిర్వహించారు.అక్కడి నుంచి బదిలీపై కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది నూతన ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు.

# టీఎన్జీవోల హర్షం




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రెండు డీఏల విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో) సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన డీఏల విడుదలకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు టీఎన్జీవో నేతలు మారం జగదీశ్వర్, ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ముఖ్యంగా పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి.. 51 శాతం ఫిట్‌మెంట్‌తో కొత్త పే స్కేళ్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ మంజూరు చేసి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు.అదేవిధంగా ఉద్యోగుల హెల్త్ కార్డుల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి.. వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని టీఎన్జీవోలు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడని ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. దాదాపు 90 శాతం ఉద్యోగులకు సంబంధించిన ఇలాంటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని టీఎన్జీవో నేతలు సూచించారు. డీఏల విడుదలకు కేబినెట్ ఆమోదం లభించిన నేపథ్యంలో మిగిలిన ఉద్యోగుల సమస్యలపైనా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

## ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఘనంగా అన్న ప్రసాద వితరణ



**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్లగొండ పట్టణంలోని లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గుట్ట మెట్ల వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముతవల్లి సమీయుల్లా ఖాద్రి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 2,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించామని అన్నారు.ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.భక్తులకు సేవ చేయడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.అనంతరం రాత్రి నిర్వహించిన అజ్మతే ఔలియా కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ఉర్దూ భాషలో లతీఫుల్లా షా ఖాద్రి గొప్పతనం, మహిమ,ఔన్నత్యాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాలను వీక్షించారు.ఈ కార్యక్రమంలో ముతవల్లీలు గౌస్ ఖాద్రి, సల్మాన్ ఖాద్రి,జమాల్ ఖాద్రి, ఉర్సు కమిటీ ఉపాధ్యక్షులు హషం,మసీయుద్దిన్, నిర్వాహకులు జయబాబు, ఫిరోజ్,నవీన్,సమద్,ఉమర్, తాహీర్,ఎజాజ్,పాషా తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# యువ ఓటర్లే టార్గెట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఓటర్ల జాబితాలో చోటు దక్కని వారు, తొలిసారి ఓటు హక్కు పొందే యువతను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 29న జారీ చేసిన లేఖ, అక్టోబర్ 1న అన్ని రాష్ట్రాల జజూలతో నిర్వహించిన సమావేశానికి కొనసాగింపుగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

**ఎస్ఐఆర్‌కు ముందు జాబితాలో పోల్చి పరిశీలన:**

ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశమని ఈసీ పేర్కొంది. ఇందులో భాగంగా బీఎల్‌వోలు ప్రస్తుత ఓటర్ల జాబితాను ఎస్ఐఆర్ కి పూర్వం ఉన్న ఓటర్ల జాబితాతో పోల్చి చూసి, పాత జాబితాలో పేర్లు ఉండి ఎస్ఐఆర్ తర్వాత పేర్లు లేని ఓటర్లను గుర్తించనున్నారు. ఇందులో అర్హులైన వారు ఓటర్ గా నమోదు కాకుండా కనిపిస్తే ఫారమ్-6 ద్వారా కొత్తగా ఓటు నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ ప్రక్రియను దాదాపు ఒక నెల వ్యవధిలో పూర్తి చేయడానికి ప్రతి వారం కనీసం 20-25 మంది ఓటర్లను ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించేలా ఆదేశించింది. ఇంటింటికీ వెళ్లే సమయంలో జాబితాలో పేర్లు లేనివారు / మొదటిసారి ఓటు హక్కు పొందేవారు / యువ ఓటర్ల నమోదు కోసం ఫారమ్-6 పూర్తి చేసేలా బీఎల్‌వోలు చర్యలు తీసుకోనున్నారు.

**బూత్ లెవల్ క్యాంపులు:**

దరఖాస్తుల సమర్పణను సులభతరం చేయడానికి 'బూత్ లెవెల్ క్యాంపులు' ఏర్పాటు చేయాలని ఈసీ ఆదేశించింది. పగటి పూట పనులకు వెళ్లే కార్మికులు, నిరాశ్రయ వర్గాల కోసం ప్రత్యేక బూత్ లెవల్‌లో ప్రత్యేక క్యాంపులు సైతం నిర్వహించాలని ఆదేశించింది. ప్రత్యేక డ్రైవ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు, స్థానిక స్థాయి కార్యక్రమాలు, మీడియా సమావేశాలు, ఇతర ప్రచార వేదికలను వినియోగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్వోలను సూచించింది. ఈ ప్రత్యేక డ్రైవ్ పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించి సమీక్షించాలని ఆదేశించింది.

# పథకాన్ని నీరుగార్చొద్దు...

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికంగా కొండంత అండగా నిలిచిన 'కళ్యాణ లక్ష్మి' పథకం ప్రారంభమై నేటితో 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. బాల్య వివాహాలను అరికట్టి, సామాజిక సంస్కరణకు బాటలు వేసిన ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం నీరుగారుస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కళ్యాణ లక్ష్మీ పథకం.. సామాజిక సంస్కరణ పథం అని లక్షలాది ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపి.. వారిని 'కళ్యాణలక్ష్ములు'గా తీర్చిదిద్దిన అద్భుత పథకం అన్నారు. 2002 మార్చిలో ములుగు మండలం గుత్తూరు తండాలో ఒక తండ్రి కన్నీటి వేదనను చూసి కేసీఆర్ మదిలో పుట్టిన ఆలోచన ఈ మహోన్నత పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిర్లక్ష్యం చుట్టుముట్టిందన్నారు. ఈ మేరకు ఇవాళ ఎక్స్ వేదికగా హరీశ్ రావు ఓ పోస్టు చేశారు.

**పెళ్లై పిల్లలు పుట్టినా ఎదురుచూపులే:**

అధికారంలోకి రాగానే 2014 అక్టోబర్ 2న రూ.51,000 ఆర్థిక సాయం అందించేలా కేసీఆర్ ఈ పథకం ప్రారంభిస్తే 2018లో రూ.1,00,116కు పెంచారని తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో 13,15,297 మంది ఆడబిడ్డలకు రూ.11,560 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు గుర్తు చేశారు. పేదింటి ఆడబిడ్డకు మేనమామలా అండగా నిలిచిన కేసీఆర్.. కళ్యాణ లక్ష్మీ ద్వారా ఒక పథకాన్ని మాత్రమే అమలు చేయలేదని బాల్య వివాహాల నిర్మూలనకు బలమైన పునాది వేశారన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి భారాన్ని తగ్గించి ఒక సామాజిక సంస్కరణకు నాంది పలికారన్నారు. అలాంటి పథకం ఇప్పుటు కాంగ్రెస్ పాలనలో పెళ్లిళ్లు అయిపోయి.. పిల్లలు పుట్టినా.. కళ్యాణ లక్ష్మీ డబ్బుల కోసం పేద కుటుంబాలు ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ. 2500 కోట్లు ఈ పథకం కోసం ఖర్చు చేస్తే, ఇప్పుడు అందులో సగం కూడా ఖర్చు చేయని పరిస్థితి ఏర్పడిందన్నారు.

**4 నెలల్లో విజయ్ అమలు మీరు మూడేళ్లైనా..**

కేసీఆర్ మీద కక్షతో ఇప్పటికే కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలను నిలిపివేశారని అదే కోవలో కళ్యాణ లక్ష్మిని నీరుగారుస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక గాలికి వదిలేశారని మూడేళ్లు గడిచినా ఆడబిడ్డలకు ఇచ్చిన హామీని అమలు చేయలేక చేతులెత్తేశారని దుయ్యబట్టారు. తులం బంగారం దేవుడెరుగు, కేసీఆర్ ఇచ్చిన లక్ష ఇస్తే చాలు అన్న పరిస్థితి వచ్చిందని, తమిళనాడు సీఎం విజయ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన బంగారం హామీని నాలుగు నెలల్లోనే అమలు చేస్తూ.. ప్రభుత్వ దవాఖానల్లో పుట్టిన ఆడబిడ్డకు బంగారు ఉంగరం అందించే పథకాన్ని ప్రారంభిస్తే తెలంగాణలో మాత్రం మూడేళ్లు గడిచినా తులం బంగారం పరిస్థితి దిక్కుతోచని స్థితిలోనే ఉందని విమర్శించారు.

**నీతి నిజాయితీ ఉంటే అమలు చేయి:**

కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటితే.. చేతలు గడప దాటవు అనడానికి మరో నిదర్శనం ఇదేనని అన్ని వర్గాలను మోసం చేసినట్టే.. పేదింటి ఆడబిడ్డలను సైతం మోసం చేసిన ఘనుడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. కళ్యాణ లక్ష్మీ/షాదీ ముబారక్ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలలని ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న సుమారు 2 లక్షల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అభయహస్తం మేనిఫెస్టోలో ఆడబిడ్డల పెళ్లికి లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ నిలబెట్టుకోవాలన్నారు. కళ్యాణ లక్ష్మీ/షాదీ ముబారక్‌ను రాజకీయ కక్షలకు బలిచేయకుండా పేదింటి ఆడబిడ్డకు అండగా నిలిచే పథకంగా కొనసాగించాలని, రేవంత్ రెడ్డికి నీతి, నిజాయితీ ఉంటే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సాక్షిగా ఇచ్చిన తులం హామీని అమలు చేసి, మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

# నాకే ఎమ్మెల్యే పదవి వస్తుంది..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దానం నాగేందర్ ఎన్నిక చెల్లకపోతే తనను ఎమ్మెల్యే ప్రకటించే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ నేత, పీజేఆర్ కుమార్తె విజయా రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. తన వాదనను కోర్టు పూర్తిగా విశ్వసిస్తోందని అన్నారు. తనకు హైకోర్టుపై పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల పిటిషన్‌పై తీర్పు రాకుండా ఉప ఎన్నిక నిర్వహించకూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. తన పిటిషన్ పక్కన పెడితే కారణాలు ఏమిటని మళ్లీ తాను కోర్టుకు వెళ్తానని చెప్పారు. అయితే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక వస్తే అధిష్ఠానం ఏం చేస్తుందో చూడాలని విజయా రెడ్డి పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయా రెడ్డి బరిలో దిగారు. ఈ ఎన్నికల్లో దానం నాగేందర్‌పై 22,010 ఓట్ల తేడాతో ఆమె ఓటమి పాలయ్యారు. అనంతరం దానం కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే ఈ ఎన్నికల్లో దానం నాగేందర్ తన అఫిడవిట్‌లో ఆస్తుల విషయంలో కీలక సమాచారాన్ని దాచి పెట్టారంటూ విజయా రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని ప్రకటించి.. ఆయన ఎన్నికను రద్దు చేయాలని ఆ పిటిషన్‌లో స్పష్టం చేశారు. ఈ పిటిషన్ విచారణ పెండింగ్‌లో ఉంది. మరో వైపు దానంపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. దీంతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయిందంటూ ఇప్పటికే అసెంబ్లీ సెక్రటరీ గెజిట్ జారీ చేశారు. దీంతో సదరు అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. అలాంటి వేళ.. దానం నాగేందర్ ఆస్తులపై తాను దాఖలు చేసిన పిటిషన్ విచారణ పూర్తయ్యే వరకు ఈ అసెంబ్లీ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకుండా ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలంటూ విజయా రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను గురువారం విచారించిన కోర్టు.. మంగళవారానికి తదుపరి విచారణకు వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య క్విడ్ ప్రో కో

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో అధికార కాంగ్రెస్, గతంలో పాలించిన బీఆర్ఎస్ మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే 'క్విడ్ ప్రో కో' నడుస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. మొన్న సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ మంత్రులు, కుటుంబీకుల ఆస్తులపై ఆరోపణలు చేస్తే దానికి ప్రతిగా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ అవినీతిపై ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. ఇవాళ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..."నువ్వు ఎంత తిన్నావు, నేను ఎంత తిన్నాను... మీరే అంతా తినేస్తే మాకేం మిగిల్చలేదు" అన్న చందంగా ఇరు పార్టీలు పరస్పర ఆరోపణలకే పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి అవినీతి రహిత సుపరిపాలన అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎవరు ఎక్కువ అవినీతి చేయాలనే పోటీ పడుతున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి చిట్టా విప్పి అరెస్టులు చేస్తామని ప్రగల్భాలు పలికి నేటికీ ఒక్క కేసులోనూ అరెస్టు చేయలేదని గుర్తు చేశారు. కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమై లోపాయికారీ ఒప్పందాలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు.

**టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి:**

రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రశ్నించే వారిపై అక్రమ అరెస్టులతో ఉక్కుపాదం మోపుతోందని రాంచందర్ రావు మండిపడ్డారు. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద జీవో 317ను బీజేపీతో పాటు ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారని, దానికి ప్రత్యామ్నాయంగా ఈ ప్రభుత్వం తెచ్చిన జీవో 190ను సైతం సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు. జీవో 190 పరిధిలో దాదాపు 4000 మందికి ట్రాన్స్‌ఫర్లు/డిప్యుటేషన్లు రావాల్సి ఉండగా, కేవలం 100 నుంచి 200 మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. దీనిపై గాంధీ భవన్ ఎదుట న్యాయబద్ధంగా ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులను పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడాన్ని బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీచర్ల న్యాయమైన కోరికలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**పొలాలు ఎండుతుంటే చోద్యం చుస్తున్నారు:**

రాష్ట్రంలో అన్నదాతల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, నీళ్లు లేక, కరెంట్ రాక పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో బోరుబావుల్లో నీరులేక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని, జూరాలకు వెళుతుంటే రైతులను, తమ పార్టీ నేతలను సైతం అరెస్టు చేశారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, రాబోయే రబీ పంటకు సిద్ధమవుతున్న అన్నదాతలను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే ఒక విడత 'రైతు భరోసా' నిధులను విడుదల చేసి వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'కు రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని దుయ్యబట్టారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కేంద్ర పథకం కంటే మెరుగైన బీమా తెస్తామని చెప్పి, నేటికీ ఎలాంటి బీమా పథకాన్ని అమలు చేయకుండా రైతుల నోట్లో మట్టికొట్టారని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రబీకి ముందే రైతు భరోసా అందించాలని స్పష్టం చేశారు.

**బీజేపీలోకి చేరికలు:**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుతో విసిగిపోయిన ప్రజలు రాష్ట్రంలో బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని, రాబోయే రోజుల్లో బీజేపీకే అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారని రాంచందర్ రావు పేర్కొన్నారు. మేధావులు, రాజకీయ చైతన్యం ఉన్న యువత పెద్దఎత్తున భారతీయ జనతా పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశం సందర్భంగా సినిమా, టీవీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు బీజేపీలో చేరారు. బీజేపీ స్టేట్ సినిమా సెల్ కో-కన్వీనర్, నటుడు వైభవ్ సూర్య ఆధ్వర్యంలో టీవీ ఆర్టిస్ట్, న్యాయవాది స్వర్ణలత, ప్రముఖ టీవీ నటుడు లక్ష్మణ్, సీనియర్ కెమెరామెన్లు సురేష్, మహేష్ బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

# ప్రజా సాహిత్యానికి ప్రాణం పోస్తున్న మంజీరా రచయితల సంఘం





**హైదరాబాద్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కవులు అంటే కవిత్వాన్ని వెలువరించేవారు మాత్రమే కాదని మాటకు , పాటకు , ఆటకు ప్రాణం పోసే వారని క్రియాశీలకంగా నిరూపిస్తున్న మంజీరా రచయితల సంఘం భావితరానికి దిక్సూచి అని మాజీమంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో, గోపాల్ రెడ్డి వేదికపై శుక్రవారం జరిగిన మంజీరా రచయితల సంఘం 40 ఏళ్ల వార్షికోత్సవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం అంటే వేడుక కాదని ప్రజాపక్షంలో నిలబడడమని మరసం నిరూపించడం చారిత్రాత్మకమని చెప్పారు. 40 ఏళ్లు సాహిత్య సంస్థ నడిపించడం కత్తి మీద సాము లాంటిది చెప్పారు. నిర్బంధాలను, బెదిరింపులను, రాజ్య హింసను తట్టుకొని నిలబడిన మరసం సామాజిక సమస్యల పరిష్కారాన్ని భుజాల మీదికి ఎత్తుకున్నదని తెలిపారు .మంజీరా రచయితల సంఘం లేకుంటే తెలంగాణ ఉద్యమం ప్రజ్వరిల్లేది కాదన్నారు. కవులను, రచయితలను, కళాకారులను, జర్నలిస్టులను ఏకం చేసి ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఘనత మరసం దని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల నగదు, ప్లాటును తిరస్కరించిన త్యాగశీలి, "నాగేటి సాలల్ల నా తెలంగాణ" పాటతో ప్రజల్లో ఎనలేని చైతన్యం కల్పించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి, మాట, ఆట,పాటలతో ఉద్యమాన్ని ఉరకలెత్తించిన దేశపతి శ్రీనివాస్ , 41 రోజుల సకల జనుల సమ్మె భేరితో పాలకులను కదిలించిన దేవి ప్రసాద్, జర్నలిస్టులను ఉద్యమం లో భాగస్వాములను చేసిన విరాహత్ అలీ కృషి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాదిరాళ్లని వివరించారు. మరసం సుదీర్ఘ ప్రస్థానానికి నిబద్ధతతే ప్రాణమన్నారు. భావితరానికి సరికొత్త స్ఫూర్తిని అందించాలని పిలుపునిచ్చారు. సాహిత్యంలో ఏఐ ప్రవేశిస్తుందని అయినప్పటికీ హృదయం పెట్టి మట్టి వాసనలతో రాసిన కవిత్వం, సాహిత్యం మాత్రమే సజీవంగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు . పాశ్చాత్య దేశాల్లో అన్ని వర్గాల వారు పుస్తక పఠనం వైపు మరలుతుంటే మన దేశంలో ఉయ్యాలలుగే పిల్లల సైతం సెల్ ఫోన్లలో ఊగడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. పుస్తక పఠనాన్ని పెంపొందించాలని కోరారు .కాంగ్రెస్ ప్రభుత్వానికి సాహిత్యం పై ప్రేమ లేదని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే తెలంగాణ అకాడమీ ఏర్పాటు చేయడం ,ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచం నలుమూలల చాటడం జరిగిందని వివరించారు. కాగా మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రభుత్వం తెలంగాణ అకాడమీ కి తాళం వేయడం, వారి సాహిత్య నిర్లక్ష్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజీరా నదిలోని చుక్క నీటిని వాడుకునే అవకాశం, ఒక్క చెక్ డాం ను నిర్మించే ప్రయత్నం జరగలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే మంజీరా నదిపై చెక్ డ్యామ్ లను నిర్మించిందని , ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీడు పడ్డ భూములను పచ్చగా మార్చిందని వివరించారు.

**మరసం వ్యక్తి కేంద్రం కాదు..విషయ కేంద్రం- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

మంజీరా రచయితల సంఘం వ్యక్తి కేంద్రంగా పనిచేయలేదని వస్తువు , విషయము కేంద్రంగా పనిచేస్తుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చెప్పారు. ఒక లక్ష్యంతో, ఆశయంతో నడుస్తుందని చెప్పారు. ఉద్యమాలకు ఆటగా , మాటగా, గొంతు గా మారిందని తెలిపారు.విభిన్న వ్యక్తులను, భావజాలాలను , సంస్థలను ఒక వేదికపై తీసుకువచ్చి నడిపించిన ఘనత మరసందని తెలిపారు. తన సాహిత్య, సాంస్కృతిక వికాసానికి మరసం పునాది పరిచిందని తెలిపారు .బెల్లీ లలిత లాంటి అద్భుత కళాకారులను మరసం వెలుగులోకి తీసుకొచ్చిందని తెలిపారు.

మరసం ఎప్పుడూ పీడితుల పక్షమే - కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి

మంజీరా నది స్ఫూర్తితో ప్రారంభమైన మంజీరా రచయితల సంఘం ఎప్పుడు ప్రజల పక్షమే వహిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మరసం వ్యవస్థాపకులు, కవి రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి స్పష్టం చేశారు. నిర్బంధాలను, అవరోధాలను ఎదుర్కొంటూ అన్ని వర్గాల వారికి వేదికగా నిలుస్తుందని తెలిపారు. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలకు మరసం ప్రేరణగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల ప్రజలతో, పల్లెలతో మరసం మ మైకమైందని చెప్పారు. మరసం కవులకు, రచయితలకు, కళాకారులకు, జర్నలిస్టులకు స్ఫూర్తి నింపిందని తెలిపారు.

**మాది తల్లి బిడ్డల అనుబంధం-టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీ**

మెతుకుసీమలో మంజీరా రచయితల సంఘంతో జర్నలిస్టులకు తల్లి బిడ్డలకు ఉండే బంధం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ తెలిపారు. మరసం కవుల రచనలు వార్తలుగా , జర్నలిస్టుల వార్తలు కవితలుగా మారినట్లు పేర్కొన్నారు. ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని, ప్రజల గొంతుకగా నిలబడి, మరసంతో కలిసి జర్నలిస్టుల సంఘం పోరు చేసినట్లు ఆయన తెలిపారు. మరసం అందించిన స్ఫూర్తి తోనే 25 ఏళ్ళ క్రితం జర్నలిస్టుల బతుకులపై తాము "కలం రాగాలు" ఆడియో క్యాసెట్ ను నిర్మించినట్లు విరాహత్ చెప్పారు. జిల్లాలో జర్నలిస్టులు నిర్బంధాలను ఎదుర్కోవడంలో మరసం అండగా నిలిచినట్లు చెప్పారు.

**స్తబ్దతను బద్దలు కొట్టాలి-టీఎన్జీవోల సంఘం పూర్వ అధ్యక్షులు దేవి ప్రసాద్**

సమాజంలో పెరుగుతున్న స్తబ్దతను కవులు, రచయితలు బద్దలు కొట్టాలని టిఎన్జీవోల సంఘం పూర్వాధ్యక్షులు దేవి ప్రసాద్ పిలుపునిచ్చారు. మేధావుల మౌనం ప్రమాదకరమన్నారు. సంక్షోభాలను అధిగమించడానికి పోరాటాలు కావాలన్నారు. మరసం ప్రజా పోరాటాలకు మద్దతుగా నిలబడిందని తెలిపారు. మహాసభకు మరసశీ అధ్యక్షులు రంగాచారి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి సిద్ధంకి యాదగిరి నివేదిక సమర్పించారు. సమావేశంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరం శంకరం, సీనియర్ పాత్రికేయులు కే అంజయ్య, తోట అశోక్, కవులు పపప్పుల రాజిరెడ్డి, అలాజిపూర్ కిషన్, భగవాన్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. అంతకుముందు ప్రెస్ క్లబ్ ముందు మరసం జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. మహా కవులను, రచయితలను స్మరించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహాసభకు తెలంగాణ నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు హాజరయ్యారవ్వడంతో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ కిక్కిరిసిపోయింది.

**చైతన్యాన్ని అందించిన వక్తల ప్రసంగాలు**

మరసం 40ఏళ్ళ వార్షికోత్సవ సందర్భంలో అంశాలపై నిర్వహించిన సాహిత్య సభలు సభికులను ఆలోచింపజేసాయి. సాహిత్యం - మహిళా దృక్పథం అంశంపై సాహిత్య విమర్శకురాలు నెల్లుట్ల రమాదేవి, సాహిత్యం - దళిత దృక్పథం అంశంపై కోయి కోటేశ్వరరావు, సాహిత్యం - ద్రావిడ దృక్పథం అంశంపై జిలుకర శ్రీనివాస్ లు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో 30మంది కవులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు




**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు.పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు మరియు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ దేశానికి అందించిన సేవలను,ఆయన చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను స్మరించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ,వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి,కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం




# క్షేత్రస్థాయిలో కదలిక అవసరం

పర్యావరణ పరిరక్షణ గురించి ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని సమావేశాలు నిర్వహించినా.. వాటి ఫలితం ప్రజల జీవన ప్రమాణాల్లో కనిపించినప్పుడే ఆ చర్యలకు అసలు అర్థం ఉంటుంది. తెలంగాణలో కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి తాజాగా నిర్వహించిన సమీక్షా సమావేశం ఈ విషయంలో ఒక కీలక అంశాన్ని ముందుకు తెచ్చింది. కాలుష్యం ఏర్పడిన తర్వాత స్పందించడం మాత్రమే కాకుండా.. అది ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయాలని మండలి చైర్మన్ అధికారులకు సూచించడం స్వాగతించాల్సిన దిశ. అయితే ఆ ఆదేశాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఎంత సమర్థవంతంగా అమలవుతాయన్నదే అసలు ప్రశ్న.పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వేగంగా జరుగుతున్న కొద్దీ పర్యావరణంపై ఒత్తిడి పెరుగుతోంది. పరిశ్రమల నుంచి వెలువడే ఉద్గారాలు, శుద్ధి చేయని వ్యర్థ జలాలు, ఘన వ్యర్థాల నిర్వహణలో లోపాలు, వాహనాల కాలుష్యం, నిర్మాణ పనుల నుంచి వెలువడే దుమ్ము.. ఇలా అనేక రూపాల్లో కాలుష్యం ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తోంది. హైదరాబాద్ వంటి వేగంగా విస్తరిస్తున్న నగరాల్లోనే కాకుండా పారిశ్రామిక ప్రాంతాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ సమస్య తీవ్రతను విస్మరించలేం.అందుకే కాలుష్య నియంత్రణ మండలి పాత్ర కేవలం పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం, నిబంధనలు ఉల్లంఘించినప్పుడు నోటీసులు జారీ చేయడంతో ముగియకూడదు. కాలుష్యం ఎక్కడ పుడుతోంది? ఎందుకు పుడుతోంది? దాని ప్రభావం ఎవరిపై పడుతోంది? నివారణకు ఏ చర్యలు తీసుకోవాలి? అనే ప్రశ్నలకు నిరంతరం సమాధానాలు వెతకాలి. ఈ దిశగా 'ఫలితాల ఆధారిత కార్యాచరణ'పై దృష్టి పెట్టడం కీలకం.ఒక పరిశ్రమ తనిఖీ చేసిన తర్వాత నిబంధనలు పాటిస్తున్నట్లు రికార్డులో నమోదవడం ఒక విషయం. ఆ పరిశ్రమ చుట్టుపక్కల గాలి, నీరు, నేల నాణ్యత వాస్తవంగా ఎలా ఉందో తెలుసుకోవడం మరో విషయం. కాబట్టి తనిఖీలు కేవలం ఫైళ్ల పరిశీలనగా కాకుండా శాస్త్రీయ డేటా ఆధారంగా జరగాలి. గాలి నాణ్యత, నీటి నాణ్యత, పారిశ్రామిక ఉద్గారాలు, వ్యర్థ జలాలపై సేకరించే సమాచారాన్ని నిరంతరం విశ్లేషించి.. సమస్య ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకునే వ్యవస్థ అవసరం.ఇక్కడ ఈటీపీలు, ఎస్టీపీలు అత్యంత కీలకం. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బయటకు వదిలితే దాని ప్రభావం నదులు, చెరువులు, భూగర్భ జలాలపై పడుతుంది. మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పడం మాత్రమే సరిపోదు. అవి నిరంతరం పనిచేస్తున్నాయా? వాటి సామర్థ్యం ఎంత? శుద్ధి చేసిన నీటి నాణ్యత నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉందా? వంటి అంశాలను కూడా పర్యవేక్షించాలి. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ట్యాంకులను సీజ్ చేయాలన్న ఆదేశాలు కూడా ఇదే క్రమంలో అమలులోకి రావాలి.అయితే పరిశ్రమలపై చర్యలు తీసుకోవడం మాత్రమే పర్యావరణ పరిరక్షణకు పూర్తి పరిష్కారం కాదు. స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, జల వనరుల శాఖ, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ, ఇతర సంబంధిత విభాగాల మధ్య సమన్వయం అత్యవసరం. ఒక ప్రాంతంలో కాలుష్యం పెరుగుతుంటే దానికి ఒక్క కారణమే ఉండకపోవచ్చు. పారిశ్రామిక వ్యర్థాలతో పాటు మురుగునీటి నిర్వహణ లోపాలు, చెత్త పారవేత, నిర్మాణ వ్యర్థాలు, ట్రాఫిక్ కూడా కారణాలు కావచ్చు. అందుకే సమస్యను విభాగాల గోడల మధ్య కాకుండా సమగ్రంగా చూడాల్సిన అవసరం ఉంది.మరో ముఖ్యమైన అంశం సిబ్బంది కొరత. రాష్ట్రంలోని ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్, రీజనల్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉంటే క్షేత్రస్థాయి తనిఖీలు, నమూనాల సేకరణ, ప్రయోగశాల పరీక్షలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి పనులపై ప్రభావం పడుతుంది. ఒకవైపు పర్యావరణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ఆదేశిస్తూ.. మరోవైపు వాటిని అమలు చేసే యంత్రాంగానికి అవసరమైన మానవ వనరులు లేకపోవడం విరుద్ధ పరిస్థితిని సృష్టిస్తుంది. కాబట్టి సిబ్బంది సమస్యను త్వరగా పరిష్కరించడంతో పాటు సాంకేతిక నిపుణులను అందుబాటులోకి తీసుకురావాలి.ప్రజల ఫిర్యాదులకు వేగంగా స్పందించడం కూడా అంతే ముఖ్యం. కాలుష్యం వల్ల నేరుగా ప్రభావితమయ్యేది ప్రజలే. ఒక ప్రాంతంలో దుర్వాసన వస్తోంది, చెరువు కలుషితమవుతోంది, పరిశ్రమ నుంచి పొగ వెలువడుతోంది, వ్యర్థ జలాలు ప్రవహిస్తున్నాయి అని స్థానికులు ఫిర్యాదు చేసినప్పుడు.. దానిపై నెలల తరబడి స్పందన లేకపోతే పర్యవేక్షణ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి, తనిఖీ నివేదిక, తీసుకున్న చర్య వంటి వివరాలతో పారదర్శక వ్యవస్థ ఉండాలి.అంతేకాదు.. కాలుష్య నియంత్రణ కంటే కాలుష్య నివారణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒకసారి గాలి లేదా నీరు కలుషితమైన తర్వాత దాన్ని తిరిగి పునరుద్ధరించడం కష్టం. కాబట్టి పరిశ్రమలు ఏర్పడే దశ నుంచే పర్యావరణ ప్రభావాలను అంచనా వేయడం, నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం, సాంకేతిక ప్రమాణాలను నిరంతరం పరిశీలించడం అవసరం.పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత కూడా కాదు. పరిశ్రమలకు బాధ్యత ఉంది. స్థానిక సంస్థలకు బాధ్యత ఉంది. ప్రజలకు కూడా బాధ్యత ఉంది. వ్యర్థాలను విచ్చలవిడిగా పారేయకపోవడం నుంచి నీటి వనరులను కాపాడటం వరకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచాలని మండలి నిర్ణయించడం కూడా అందుకే ముఖ్యమైన అంశం.చివరగా గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే.. కాలుష్యాన్ని కొలిచే యంత్రాలు పెరగడం కంటే కాలుష్యం తగ్గడం ముఖ్యం. తనిఖీల సంఖ్య పెరగడం కంటే నిబంధనల అమలు మెరుగుపడటం ముఖ్యం. సమావేశాల సంఖ్య పెరగడం కంటే ప్రజల ఆరోగ్యం, పర్యావరణ నాణ్యత మెరుగుపడటం ముఖ్యం.తెలంగాణ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. పారిశ్రామిక, పట్టణ విస్తరణతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాంతరంగా సాగాలి. అభివృద్ధి పేరుతో ప్రకృతిని కోల్పోతే ఆ అభివృద్ధి భవిష్యత్ తరాలకు భారంగా మారుతుంది. అందుకే కాలుష్య నియంత్రణ మండలి క్షేత్రస్థాయిలో తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజల శ్వాసకు, తాగునీటికి, నేలకు, భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలకు సంబంధించినదే. కాలుష్యం వచ్చిన తర్వాత పరుగులు పెట్టే వ్యవస్థ కాకుండా.. కాలుష్యం రాకముందే అడ్డుకునే వ్యవస్థగా తెలంగాణ పీసీబీ మారితేనే పర్యావరణ పరిరక్షణకు నిజమైన అర్థం ఉంటుంది.

# ఏఐతో జరుగుతున్న నష్టాలేంటి..?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో.. కొత్త సాంకేతికత మానవాళికి ముప్పుగా మారుతుందనే భయాలు వ్యక్తమౌతున్నాయి. ఇదే సమయంలో ఏఐ మోడళ్లు అదుపు తప్పి ప్రవర్తిస్తున్న దాఖలాలు నమోదుకావడం.. కలకలం రేపుతోంది. సాక్షాత్తూ ఏఐని అభివృద్ధి చేసిన కంపెనీలే.. వేగం కంటే నియంత్రణ ముఖ్యమని ప్రకటనలు చేయడం.. అందరికీ కలవరం కలిగిస్తోంది. ఇలాంటి తరుణంలో.. ఏఐపై ట్రంప్ నిర్వహించిన కీలక సమావేశం.. భవిష్యత్ సవాళ్లకు ఏ మేరకు పరిష్కారాలు చూపగలదనేది ఆసక్తికరంగా మారింది. ఏఐ మోడల్స్ అదుపుతప్పి ప్రవర్తిస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో.. కీలక పరిణామం చోటుచేసుకుంది. వైట్‌హౌస్‌లో ప్రముఖ టెక్ కంపెనీల ప్రతినిధులతో కలిసి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏఐ అకార్డ్‌ను ఆవిష్కరించారు. మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్, ఎన్విడియా అధినేత జెన్సన్ హువాంగ్, ఆంథ్రోపిక్ అధినేత డారియో అమోడెయి, ఓపెన్‌ఏఐ అధ్యక్షుడు గ్రెగ్ బ్రాక్‌మన్, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల, గూగుల్ అధినేత సుందర్ పిచాయ్, ఎలాన్ మస్క్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. దీంతో ఏఐని అదుపులో పెట్టే నైతిక బాధ్యతను అగ్రశ్రేణి టెక్ కంపెనీలు స్వచ్ఛందంగా తీసుకున్నట్లయింది. ఈ ఒప్పందం కింద టెక్ కంపెనీలు తమంతట తామే ఐటీ భద్రతను సమీక్షించుకుంటాయి.ఏఐ వల్ల మానవాళికి ఎదురయ్యే ముప్పుపై కొత్త హెచ్చరికలు రావడంతో, ఈ టెక్నాలజీ ఎప్పుడైనా మనుషుల నియంత్రణ దాటి ప్రమాదకరంగా మారుతుందా అనే పాత చర్చ మళ్లీ మొదలైంది. ముఖ్యంగా, ఏఐని తయారు చేస్తున్న కంపెనీలు ఇలాంటి ప్రమాదాలను అడ్డుకునేందుకు సరైన చర్యలు తీసుకుంటున్నాయా అనే ప్రశ్న కూడా ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తోంది. ఏఐపై ఆందోళనలు పెరుగుతుండటం.. మరోవైపు ఏఐ మోడళ్ల అదుపుతప్పి ప్రవర్తించే తీరు కూడా దిగ్గజ కంపెనీలను స్వచ్ఛంద నియంత్రణ దిశగా నడిపించాయని చెప్పాలి. ఈ విషయంలోనూ అమెరికా చొరవ తీసుకుంది. కృత్రిమ మేధ రంగంపై కొత్తగా కఠినమైన సమాఖ్య నిబంధనలు తీసుకురావడం కంటే కంపెనీలే తమను తాము పర్యవేక్షించుకోవాలన్న వైఖరిని ట్రంప్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న చట్టాలు, ప్రభుత్వ సంస్థల ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవచ్చని ఆయన అన్నారు. అమెరికా సాంకేతిక రంగంలో చైనా కంటే ముందంజలో ఉండాలంటే అభివృద్ధిపై అధిక నియంత్రణలు విధించడం సరికాదన్నది ట్రంప్ వైఖరి. ఏఐ సాంకేతికత అభివృద్ధిని అమెరికా ప్రభుత్వం నియంత్రించదని, అడ్డుకోదని ఈ సందర్భంగా ట్రంప్ స్పష్టం చేశారు. ఈ రంగాన్ని సూపర్ ఇంటెలిజెన్స్ అని పిలవాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సమాచారం, సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచే లక్ష్యంతో ట్రంప్ America.gov సైట్‌ను ఆవిష్కరించారు. ఇది ఏఐ సాంకేతికతతో నడుస్తుంది. ఈ సైట్‌లో ఓ విభాగం యూజర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది. కొన్ని సమాధానాలు ట్రంప్ ప్రకటనలకు భిన్నంగా ఉన్నాయి. ఓ ప్రశ్నకు.. ఎప్‌స్టీన్ ఫైళ్లలో ట్రంప్ పేరు ఉందని సమాధానం ఇచ్చింది. తర్వాత వెంటనే సైట్ తన సమాధానాలను సవరించుకుంది.కృత్రిమ మేధ భవిష్యత్తు ప్రమాదాలపై అధ్యయనం చేయడానికి అమెరికా, చైనాలు కలిసి పనిచేయాలనే ఆలోచనను డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. తమ సాంకేతిక నైపుణ్యాలను మరో దేశంతో పంచుకుంటే టెక్ రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని కోల్పోతుందని ఆయన చెప్పారు. మరోవైపు అమెరికాతో ఆరు టెక్ దిగ్గజాలు కుదుర్చుకున్న కృత్రిమ మేధ భద్రతా ఒప్పందాన్ని ట్రంప్ విడుదల చేశారు. ఏఐ కట్టు తప్పుతున్న తరుణంలో గూగుల్, ఎన్విడియా, ఆంథ్రోపిక్, ఓపెన్‌ఏఐ, స్పేస్‌ఎక్స్‌ఏఐ, మెటా సంస్థలు స్వచ్ఛందంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనికి సంబంధించిన డాక్యుమెంట్‌ను ట్రంప్ ట్రూత్ సోషల్లో పోస్ట్ చేశారు.చట్టపరంగా కఠినమైన నిబంధనలు కాకుండా, టెక్ కంపెనీలు తమంతట తాముగా భద్రతా ప్రమాణాలు పాటించేలా ఒక నైతిక ఒప్పందంపై ఈ దిగ్గజాలు సంతకాలు చేశాయి. ఏఐ వ్యవస్థలు మరింత శక్తివంతంగా మారుతున్న తరుణంలో ఎలాంటి ముప్పు వాటిల్లకుండా కంపెనీలే స్వయంగా పర్యవేక్షించుకోవాలని ఈ ఒప్పందం స్పష్టం చేస్తోంది. ఇది చట్టబద్ధమైనది కాకపోయినా, అమెరికా భద్రత దృష్ట్యా అత్యంత కీలకమైన అడుగుగా భావిస్తున్నారు. టెక్ కంపెనీలు అమలు చేయాల్సిన భద్రతా మార్గదర్శకాలపై వైట్‌హౌస్ ఒక స్పష్టమైన కార్యాచరణను రూపొందించింది. దీని ప్రకారం ప్రతి కంపెనీ నాలుగు అంచెల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. మొదటిది ఇంటర్నల్ కంట్రోల్. ఏఐ మోడల్స్ శిక్షణ దశలోనే సైబర్ సెక్యూరిటీ, బయోసెక్యూరిటీ ప్రమాదాలను నివారించేలా పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలి. రెండోది స్పెషల్ టీమ్స్. భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఇంటర్నల్ టీమ్స్ పనిచేయాలి. మూడోది ఎక్స్‌టర్నల్ ఆడిట్. నిపుణులతో కూడిన స్వతంత్ర ఎక్స్‌టర్నల్ ఆడిటర్ల ద్వారా భద్రతా విధానాలపై స్వతంత్ర అంచనాలు వేయించాలి. చివరిగా బోర్డు పర్యవేక్షణ. డైరెక్టర్ల బోర్డు నుంచి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఈ ఆడిట్ నివేదికలను పరిశీలిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి.అయితే టెక్ సంస్థలు అంగీకరించిన ఈ పత్రానికి ప్రస్తుతం చట్టబద్ధమైన అమలు బలం లేదు. అంటే నిబంధనలు పాటించకపోతే వెంటనే శిక్షించే విధానం ఇందులో లేదు. అయితే సైబర్ భద్రత, జీవ భద్రత, రసాయన సంబంధిత ప్రమాదాలు వంటి అంశాల్లో ప్రమాదాలను గుర్తించి నియంత్రించేందుకు సంస్థలు చర్యలు తీసుకోవాలని ఒప్పందం సూచిస్తోంది. భవిష్యత్తులో అవసరమైతే వీటిలో కొన్ని అంశాలను చట్టాలుగా మార్చే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత అభివృద్ధికి భారీ కంప్యూటింగ్ సామర్థ్యం అవసరం. ఇందుకోసం డేటా కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ట్రంప్ కోరుతున్నారు. సూపర్ ఇంటెలిజెన్స్ రంగాన్ని పర్యవేక్షించేందుకు దాదాపు పది మందితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ట్రంప్ తెలిపారు. అయితే ఆ కమిటీలో ఎవరుంటారు? దానికి ఎలాంటి అధికారాలు ఉంటాయి? అన్న దానిపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు. అమెరికా సాంకేతిక ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఈ రంగంలో వేగంగా అభివృద్ధి అవసరమని ట్రంప్ చెబుతున్నారు.మరోవైపు కృత్రిమ మేధ మోడళ్లు కట్టుతప్పకుండా వాటిని నియంత్రించే సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌నొకదాన్ని దిగ్గజ చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియా విడుదల చేసింది. దాని పేరు.. ఓపెన్ ఏజెంట్ సేఫ్టీ ప్లాట్‌పామ్. చాట్‌జీపీటీ, జెమెనై, క్లాడ్, గ్రోక్ వంటి ఏఐ ఏజెంట్లు ఇష్టానుసారంగా ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల సర్వర్లలోకి చొరబడకుండా కేవలం తమకు అనుమతి ఉన్న పనులు మాత్రమే చేసే నియంత్రిత వాతావరణాన్ని ఈ ప్లాట్‌ఫామ్ సృష్టిస్తుందని ఎన్‌విడియా సీఈవో జెన్‌సెన్ హువాంగ్ తెలిపారు. అందులో భాగంగా ఈ ప్లాట్‌ఫామ్‌లో రెండు రక్షణ వలయాలుంటాయి. ఒకటి.. ఓపెన్‌షెల్. ఇది సీపీయూ, జీపీయూల స్థాయిలో పనిచేస్తుంది. అంటే.. ఏఐ మోడళ్లు మన వ్యక్తిగత పరికరాల్లో చేయకూడని పనులేవైనా చేస్తుంటే ఆపుతుంది. రెండోది సెంట్రీ. ఇది నెట్‌వర్క్ చిప్స్ స్థాయిలో పనిచేస్తుంది. అంటే.. ఏఐ మోడళ్లు మనం చెప్పే పనులు చేయడానికి హ్యాకింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తే నిరోధించే వ్యవస్థ. ఇలా రెండు దశల్లోనూ ఏఐని నియంత్రించగలిగితే అది పూర్తిగా మానవుల అదుపాజ్ఞల్లో ఉంటుందన్నది ఎన్‌విడియా ఆలోచన. ఇప్పటికే కృత్రిమ మేధ కారణంగా పిల్లలు ప్రాథమిక గణితాన్ని మర్చి పోతున్నారని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ ఆందోళన వ్యక్తం చేశారు. హోంవర్క్‌ను త్వరగా పూర్తి చేయడానికి విద్యార్థులు ఏఐపై ఎక్కువగా ఆధారపడుతున్నారని, దీనివల్ల సొంతంగా ఆలోచించే శక్తి తగ్గుతుందన్నారు. మొత్తం మీద అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు కొన్ని సందర్భాల్లో వాటికి నిర్దేశించిన పరిమితులను దాటి పనిచేసే అవకాశం ఉందన్న ఆందోళనలు ఇప్పటికే ఉన్నాయి. సైబర్ దాడులు, జీవ భద్రత, రసాయన ప్రమాదాలు వంటి అంశాల్లో ఈ సాంకేతికతను దుర్వినియోగం చేసే అవకాశాలపై నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో అమెరికా ఇప్పుడు అభివృద్ధి వేగాన్ని పెంచడంతోపాటు భద్రతా నియంత్రణలను ఎలా బలోపేతం చేయాలి అన్న సవాల్‌ను ఎదుర్కొంటోంది.

# అసలు దేశభక్తి అంటే ఏమిటి?

మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది రాజ్యాంగం. అది కేవలం పాలకులకు అధికారాన్ని ఇచ్చే పత్రం కాదు.. పౌరులకు హక్కులను, ప్రభుత్వానికి బాధ్యతలను, సమాజానికి సమానత్వం అనే విలువను నిర్దేశించే మార్గదర్శి. అందుకే ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఒక ప్రశ్న అడిగినప్పుడు ముందుగా ఆ ప్రశ్నలో దేశద్రోహాన్ని వెతకడం కంటే.. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది అనే విషయాన్ని ఆలోచించాలి. రాజ్యాంగం ప్రతి వ్యక్తికి సమానత్వాన్ని హామీ ఇస్తుంది. అదే సమయంలో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, మానవతా భావం, ప్రశ్నించే మరియు సంస్కరణ కోరే మనస్తత్వాన్ని పెంపొందించడం పౌరుల ప్రాథమిక విధుల్లో భాగమని రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ పేర్కొంటుంది.ఇక్కడే అసలు చర్చ మొదలవుతుంది. దేశ ప్రయోజనం అంటే ఏమిటి? దేశభక్తి అంటే ఏమిటి? ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండటమేనా? లేక దేశ రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రశ్నించడం కూడా దేశ సేవలో భాగమేనా?ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుంది. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. కాబట్టి ఎన్నికల తర్వాత కూడా ప్రజల పాత్ర ముగిసిపోదు. ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించడం, ప్రజా విధానాలను ప్రశ్నించడం, తప్పులు జరిగితే వాటిని ఎత్తిచూపడం, తమ హక్కుల కోసం పోరాడటం ప్రజాస్వామ్య ప్రక్రియలో సహజమైన భాగాలు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతివారినీ దేశ వ్యతిరేకులుగా చూడటం ప్రజాస్వామ్య సంభాషణను బలహీనపరిచే ప్రమాదం ఉంది.అయితే ప్రశ్నించడానికి కూడా బాధ్యత ఉంది. నిర్ధారణ లేని ఆరోపణలను నిజాలుగా ప్రచారం చేయడం, వ్యక్తిగత దూషణలకు దిగడం, హింసను ప్రోత్సహించడం, కులం--మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టడం ప్రజాస్వామ్య విమర్శ కాదు. విమర్శ విధానాలపై ఉండాలి.. ప్రజా నిర్ణయాలపై ఉండాలి.. పాలనలోని లోపాలపై ఉండాలి. ఎన్నికల సంఘం కూడా రాజకీయ పార్టీల విమర్శలు విధానాలు, కార్యక్రమాలు, గత పనితీరుపైనే ఉండాలని, నిర్ధారణ లేని ఆరోపణలు లేదా వక్రీకరణలకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తోంది.అదే విధంగా ఎన్నికల్లో డబ్బు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలతో ఓటర్లను ప్రభావితం చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన సమస్య. ఓటుకు డబ్బు తీసుకోవడం కూడా అవినీతి చర్యగా ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. ఓటు వేయడానికి డబ్బు, మద్యం లేదా ఇతర ప్రలోభాలు ఇవ్వడం ఎన్నికల చట్టాల పరిధిలో నిషేధిత చర్యలు.అందుకే మనం ఒక ప్రశ్న వేసుకోవాలి. ఓటు విలువను డబ్బుతో కొనాలనుకునే రాజకీయ సంస్కృతి ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుందా? లేక ఓటరు తన ఆలోచనతో, తన సమస్యల ఆధారంగా, తనకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే పరిస్థితిని సృష్టించడమే ప్రజాస్వామ్య బలం కాదా?అధికారం ఎవరి చేతిలో ఉన్నా.. ప్రభుత్వ వనరులు ప్రజలవే. ప్రకృతి సంపద ప్రజలదే. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల పన్నులతో, దేశ వనరులతో నిర్మించబడినవే. వాటిపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రజా ప్రయోజనం, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిందే. ఒక నిర్ణయం అభివృద్ధికి దోహదపడుతుందని ప్రభుత్వం చెబితే.. దాని ప్రయోజనం ఎవరికీ? నష్టం ఎవరికి? ప్రజా ధనం ఎలా వినియోగమవుతోంది? నిర్ణయ ప్రక్రియ ఎంత పారదర్శకంగా ఉంది? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం పాలక వ్యవస్థ బాధ్యత.మతం, సంస్కృతి, సంప్రదాయాలు ప్రజల వ్యక్తిగత మరియు సామాజిక జీవితంలో ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉండవచ్చు. వాటిని గౌరవించడం ఒక విషయం.. వాటి పేరుతో ప్రశ్నించే హక్కును అణచివేయడం మరో విషయం. రాజ్యాంగం స్వేచ్ఛను, సమానత్వాన్ని, మానవ గౌరవాన్ని కాపాడుతూనే శాస్త్రీయ దృక్పథం, మానవతా భావం, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తోంది.అందువల్ల సమాజంలో ప్రశ్నించే గొంతులు ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు. ప్రశ్నించే గొంతులు పూర్తిగా లేకపోవడమే ప్రమాదం. కానీ ప్రశ్నించే గొంతు కూడా ఆధారాలతో మాట్లాడాలి. ప్రజలను తప్పుదోవ పట్టించకుండా మాట్లాడాలి. చట్టాన్ని గౌరవించాలి. అప్పుడు మాత్రమే విమర్శ ప్రజాస్వామ్య విలువగా నిలుస్తుంది.ఇక 'దేశద్రోహి' అనే పదాన్ని కూడా అత్యంత జాగ్రత్తగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించడం, ఒక చట్టాన్ని విమర్శించడం, సామాజిక అన్యాయంపై నిరసన వ్యక్తం చేయడం మాత్రమే దేశద్రోహానికి సమానమని భావించడం సరైన ప్రజాస్వామ్య దృక్పథం కాదు. అదే సమయంలో దేశ వ్యతిరేక హింస, రాజ్యాంగ విరుద్ధ కార్యకలాపాలు లేదా చట్టపరంగా నేరంగా నిర్ధారించబడిన చర్యలను రాజకీయ విమర్శతో కలపడం కూడా సరికాదు.అసలు దేశ ప్రయోజనం ఎక్కడ ఉంది? రాజ్యాంగం బలంగా ఉన్న చోటా? లేక ప్రశ్నించే హక్కు బలహీనపడిన చోటా? ప్రజల ఓటు స్వేచ్ఛగా ఉన్న చోటా? లేక ఓటు విలువ డబ్బు, మద్యం, ప్రలోభాలతో నిర్ణయించబడే చోటా? పాలకులను ప్రజలు ప్రశ్నించగలిగే చోటా? లేక ప్రశ్నించినవారిని మౌనం చేయించే చోటా?దేశం అంటే కేవలం భూభాగం కాదు.. దేశం అంటే ప్రజలు, వారి హక్కులు, వారి గౌరవం, వారి భవిష్యత్తు. పాలకులు మారవచ్చు.. పార్టీలు మారవచ్చు.. విధానాలు మారవచ్చు. కానీ రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్య జవాబుదారీతనం వంటి విలువలు నిలిచి ఉండాలి.అందుకే దేశభక్తిని నినాదాలతో కాదు.. ప్రజల హక్కులను ఎంతగా గౌరవిస్తున్నాం, రాజ్యాంగ విలువలను ఎంతగా కాపాడుతున్నాం, ప్రజా ధనానికి ఎంత జవాబుదారిగా ఉంటున్నాం, ఓటు స్వేచ్ఛను ఎంతగా గౌరవిస్తున్నాం, ప్రశ్నించే హక్కును ఎంతగా రక్షిస్తున్నాం అన్నదానితో కొలవాలి.ప్రజాస్వామ్యంలో చివరి మాట ఎప్పుడూ ప్రజలదే. అయితే ఆ ప్రజల తీర్పు స్వేచ్ఛగా ఉండాలంటే సమాచారం కావాలి.. ప్రశ్నించే హక్కు కావాలి.. భయంలేని వాతావరణం కావాలి.. రాజ్యాంగ పరిరక్షణ కావాలి. అందుకే పాలకులను ప్రశ్నించే ప్రతి గొంతును దేశద్రోహంగా చూడకుండా, ప్రతి విమర్శను ప్రజాస్వామ్య సంభాషణలో భాగంగా స్వీకరించే సంస్కృతి అవసరం. అదే సమయంలో ప్రతి పౌరుడూ తన మాటకు బాధ్యత వహించాలి. రాజ్యాంగాన్ని కాపాడటం అంటే దేశాన్ని కాపాడటమే.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం అంటే దేశ భవిష్యత్తును బలోపేతం చేయడమే.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# మహాదేవపూర్, పలిమెల మండలాల్లో మంత్రి పర్యటన

**ఫైర్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఆసుపత్రి ప్రారంభోత్సవాలు**
**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**



**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం మహాదేవపూర్, పలిమెల మండలాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయనున్నారు. మంత్రి పర్యటన వివరాలను ఆయన వ్యక్తిగత సహాయకుడు ఏ. చంద్రశేఖర్ శుక్రవారం వెల్లడించారు.

**మహాదేవపూర్‌లో..**

మంత్రి శ్రీధర్‌బాబు ఉదయం 10 గంటలకు మహాదేవపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన అగ్నిమాపక కేంద్రాన్ని (ఫైర్ స్టేషన్) ప్రారంభించనున్నారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

**పలిమెల మండలంలో ..**

ఉదయం 11.30 గంటలకు పలిమెల మండలం పంకెన గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన అదనపు భవనాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పలిమెలలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.3 కోట్లతో మంజూరైన పలిమెల--గోదావరి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రూ.1.93 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ప్రారంభిస్తారు. అదే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సమాఖ్యలకు మంజూరు చేసిన వివో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రూ.80 లక్షల వ్యయంతో పలిమెల, నీలంపల్లి, లెంకలగడ్డ, పంకెన, దమ్మూరు, సర్వాయిపేట, మూదేడు, ముకునూరు గ్రామాల్లో ఈ భవనాలను నిర్మించనున్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, కొత్తగా చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు.



## బస్ కండక్టర్‌గా మారిన సీఎం విజయ్..

**తమిళనాడు :** తమిళనాడు సీఎం విజయ్ బస్సులో టికెట్ కండక్టర్‌గా మారారు. స్వయంగా ఆయనే బస్సు ఎక్కి ప్రయాణికులకు టికెట్లు ఇచ్చారు. విజయ్ అధికారంలోకి వచ్చిన తరవాత మహిళలకు ఫ్రీబస్ ప్రయాణం పథకం తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ పథకం ద్వారా సుమారు 84 లక్షల మంది ప్రయోజనం పొందుతుండగా సేవలను మరింత విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది వరకు ఆర్డినరీ బస్సులకే పథకాన్ని పరిమితం చేయగా ఇకనుండి డీలక్స్, ఎక్స్‌ప్రెస్ కేటగిరీ సేవలను సైతం వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే పథకాన్ని విస్తరించిన సందర్భంగా విజయ్ బస్సు ఎక్కి మహిళలకు ఫ్రీ టికెట్లు ఇచ్చారు. మహిళ ప్రయాణికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. విజయ్ బస్సులోకి రావడంతో కొందరు కాలేజీ విద్యార్థినులు ఆయనకు ప్రేమతో చాక్లెట్లు ఇచ్చారు. వాటిని విజయ్ తన జేబులో దాచుకున్నారు. మహిళల ఆర్థిక భారం తగ్గించి, ప్రజా రవాణాను మరింత వినియోగంలోకి తీసుకువచ్చేందుకే ఉచిత బస్ ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్నట్టు విజయ్ ఈ సందర్భంగా చెప్పారు. పథకం విస్తరణతో మరిన్ని ప్రాంతాల్లో మహిళలకు ప్రయోజనం అందుతుందని తెలిపారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ఒకే నగరం, ఒకే చట్టం

## హైదరాబాద్‌లో అమలులోకి 'క్యూర్ 2026' చట్టం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో సమర్థవంతమైన పాలన, డిజిటల్ ఆధారిత వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం రూపొందించిన క్యూర్ చట్టం శుక్రవారం నుంచి అమల్లోకి రానుంది. 70 ఏండ్ల తర్వాత జీహెచ్ఎంసీ-1955 స్థానంలో క్యూర్ -2026 చట్టం అమల్లోకి రానుంది. ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం లక్ష్యంతో జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీల పరిధిలో వర్తించేలా ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ఈ చట్టం ద్వారా హైడ్రాకు చట్టపరమైన గుర్తింపు, అదనపు అధికారాలు లభించనున్నాయి. క్యూర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో ఏకీకృత పాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాలం చెల్లిన, అవసరం లేని నిబంధనలను తొలగించడం ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా మార్పులు చేయడం లక్ష్యంగా క్యూర్ బిల్లును తీసుకువచ్చారు. మార్గదర్శకాల జారీ చేయడంతో పాటు అమలు చేయడానికి సుమారు 6 నెలల సమయం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమలుల్లోకి రానుందని అధికారులు చెబుతున్నారు.

**హైడ్రా, ట్రై కార్పొరేషన్లకు చట్టబద్ధత**

జీహెచ్ఎంసీ-1955 చట్టం స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూర్-2026 చట్టంతో హైడ్రాకు చట్టబద్ధత కల్పించారు. పాత డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ (ఈవీడీఎం) స్థానంలో 19 జులై 2024 న జీఓ ఎంఎస్ నెం.99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. క్యూర్ చట్టంతో పూర్తి చట్టబద్ధంగా ఏర్పడడం తోపాటు అదనపు అధికారాలూ వచ్చాయి. క్రిమినల్ కేసులు బుక్ చేయడానికి పోలీసు స్టేషన్ చట్ట పరిధిలోకి వచ్చింది. ఇక నుంచి హైడ్రా నేరుగా క్రిమినల్ కేసులు బుక్ చేయనుంది. దీంతోపాటు కొత్తగా ఏర్పడిన జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలకు సైతం చట్టబద్ధత కల్పించారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధి, ఎక్కడికక్కడే విధుల నిర్వహణ అంతా చట్ట ప్రకారమే జరగనుంది.

**క్యాపిటల్ వ్యాల్యూ ఆధారంగా..**

క్యూర్ చట్టంలో ప్రాపర్టీ ట్యాక్స్ కీలక అంశంగా మారింది. ప్రస్తుతం ఉన్న యాన్యువల్ రెంటల్ వ్యాల్యూ(ఏఆర్వీ)కి బదులు క్యాపిటల్ (సబ్ రిజిస్ట్రార్ రేటు ఆధారంగా) వ్యాల్యూ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయనున్నారు. అయితే కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రాపర్టీలకు మాత్రమే శుక్రవారం (2 అక్టోబర్2026) క్యాపిటల్ వ్యాల్యూ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయనున్నారు. పాత ప్రాపర్టీలకు మాత్రం ఏప్రిల్ 2027 నుంచి క్యాపిటల్ వ్యాల్యూ ఆధారంగా వసూలు చేయనున్నారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి ఏడాది 10 శాతం పెంచేలా చట్టంలో పొందుపర్చారు. అయితే ఇప్పటికే జీహెచ్ఎంసీలో విలీనమైన 27 మున్సిపాలిటీల్లో క్యాపిటల్ వ్యాల్యూ(సీవీ) ఆధారంగానే ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. పాత జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాపర్టీలకు ఏఆర్వీ స్థానంలో సీవీ ఆధారంగా వసూలు చేయనున్నారు. ఫలితంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, శేరిలింగంపల్లి, మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లోని ప్రాపర్టీ ట్యాక్స్ ఆదాయం పెరగనుందని అధికారులు చెబుతున్నారు.

**సీఎంసీ, ఎంఎంసీలతో ఒప్పందం**

క్యూర్ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జవహర్ నగర్ డంపింగ్ యార్డు నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణపై జీహెచ్ఎంసీతో రాంకీ సంస్థ ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే కొత్తగా జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీతో రాంకీ చేసుకున్న ఒప్పందం యథావిధిగా కొనసాగుతుంది. కానీ సీఎంసీ, ఎంఎంసీలతో మాత్రం కొత్తగా రాంకీ ఒప్పందం చేసుకునే అవకాశముంది.

# నీ ధైర్యసాహసాలకు దేశం గర్విస్తోంది..

**ఢిల్లీ:** ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన హింసాత్మక ఘటనలో తీవ్రంగా గాయపడినా.. ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు ధైర్యంగా పోరాడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చార్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. శుక్రవారం వీడియో కాల్ ద్వారా మచ్చార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఘటన సమయంలో కాక్‌పిట్‌లో ఎదురైన పరిస్థితులను కెప్టెన్ ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన చూపించిన ధైర్యసాహసాలను మోదీ మరోసారి ప్రశంసించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**'ధైర్యం చూపకపోతే.. 170 మంది ప్రాణాలు పోయేవి': మచ్చార్**

వీడియో కాల్‌లో ప్రధాని మోదీతో మాట్లాడిన సందర్భంగా ఘటనకు సంబంధించిన తన అనుభవాన్ని మచ్చార్ వివరించారు. 'ఆ సమయంలో నేను నా ప్రాణాల కోసం పోరాడుతున్నాను. కానీ నేను ధైర్యం చూపకపోతే 170 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతారని అర్థమైంది' అని ప్రధానికి చెప్పినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడినప్పటికీ మచ్చార్ కాక్‌పిట్ తలుపును తెరవగలిగారు. దీంతో సిబ్బంది, ప్రయాణికులు లోపలికి ప్రవేశించి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు అవకాశం లభించింది.

**భారత్ గర్విస్తోంది: ప్రధాని మోదీ**

మచ్చార్ చూపిన ధైర్యాన్ని ప్రధాని మోదీ మరోసారి ప్రశంసించారు. అంతకుముందు ఎక్స్ వేదికగా స్పందించిన మోదీ.. కెప్టెన్ స్మిత్ మచ్చార్‌ను "హీరో"గా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, పట్టుదలను కొనియాడారు. ఆయన సాహసం వందలాది ప్రాణాలను కాపాడిందని పేర్కొంటూ.. "కెప్టెన్ మచ్చర్ పట్ల భారత్ గర్విస్తోంది" అని అన్నారు. అంతకుముందు గురువారం మచ్చార్ భార్య, తల్లిదండ్రులతోనూ మోదీ మాట్లాడారు. మచ్చార్, ఆయన కుటుంబానికి భారత దౌత్య కార్యాలయాల నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**9/11 తరహా విషాదాన్ని భారతీయుడు అడ్డుకున్నారు: ప్రధాని మోదీ**

ఢిల్లీలో గురువారం జరిగిన యూపీఎస్సీ శతాబ్ది వేడుకల్లోనూ ప్రధాని మోదీ ఈ ఘటనను ప్రస్తావించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత కెప్టెన్ స్మిత్ అద్భుతమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారు" అని మోదీ పేర్కొన్నారు. బుధవారం ఫ్లైదుబాయ్ విమానం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తుండగా కాక్‌పిట్‌లో కెప్టెన్, కో-పైలట్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో సుమారు 34 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న బోయింగ్ 737 విమానం నిమిషానికి దాదాపు 23 వేల అడుగుల వేగంతో కిందకు దిగింది. అనంతరం సుమారు 15,600 అడుగుల వద్ద విమానం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు సమాచారం. తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని టబుక్‌కు మళ్లించారు.

**13 ఏళ్లకు పైగా విమానయాన అనుభవం**

కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు వాణిజ్య విమానయాన రంగంలో 13 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఇప్పటివరకు సుమారు 9,750 గంటలు విమానాలు నడిపిన ఆయన.. ఎక్కువగా బోయింగ్ 737 విమానాలను నడిపారు. ఫ్లైదుబాయ్‌లో చేరకముందు 11 ఏళ్ల పాటు స్పైస్‌జెట్‌లో పనిచేశారు. అక్కడ లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

# ప్రయాణికులకు షాక్..
# రాష్ట్రంలో ఆటో ఛార్జీలు పెంపు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో ఆటో ప్రయాణికులకు బిగ్ షాక్ తగిలింది. పెరిగిన ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఆటో ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓ నంబర్ 46ను జారీ చేసింది. వెంటనే దీనిని అమలు చేయాలని రవాణాశాఖను ఆదేశించింది. నూతన నిబంధనల ప్రకారం ఆటో ప్రయాణానికి కనీస ఛార్జీ రూ.30గా నిర్ణయించింది. మొదటి 1.6 కిలోమీటర్లకు రూ.30, ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు అదనంగా రూ.14 వసూలు చేయాలని నిర్ణయించింది. ఇక రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి అదనపు ఛార్జీలు వర్తించనున్నాయి. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య ప్రయాణించే వారు సాధారణ ఛార్జీ కంటే 1.5 రెట్లు (అదనంగా 50 శాతం) చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి. ట్రాఫిక్ లేదా మరే ఇతర కారణం చేతనైనా ఆటో ఆగిపోతే వెయిటింగ్ ఛార్జీలను నిమిషానికి 75 పైసలుగా నిర్ణయించారు. లగేజీపై కూడా ఛార్జీలు విధించారు. తక్కువ లగేజీకి ఎలాంటి ఛార్జీ లేదు. పరిమితికి మించి లగేజీ ఉంటే ప్యాకేజీకి రూ.0.50 పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 100 కేజీల వరకూ ఆటోల్లో లగేజీని తీసుకెళ్లవచ్చు. పెరిగిన ఛార్జీలతో ప్రయాణికులపై కాస్త భారం పడనున్నప్పటికీ, ఆటో డ్రైవర్ల శ్రేయస్సును పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజాగా సవరించిన ఛార్జీలకు అనుగుణంగా మీటర్లను సరిచేసుకునేందుకు ఆటోడ్రైవర్లకు మూడు నెలల సమయం ఇచ్చారు.




## ఏఐ సాంకేతికతకు రాజ్యాంగ విలువలే రక్ష

**ఢిల్లీ :** న్యాయవ్యవస్థలో డిజిటలైజేషన్, కృత్రిమ మేధ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అయితే ఈ క్రమంలో రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక విలువలు ఏమాత్రం దెబ్బతినకుండా చూసుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌ఖండ్ నగరంలో జరిగిన ఏషియన్ కాన్‌స్టిట్యూషనల్ కోర్టుల సంఘం (ఏఏసీసీ) 7వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. నేటి ప్రపంచంలో సమాజం, ప్రభుత్వ పాలన, వ్యాపార లావాదేవీలు, ప్రజల జీవనశైలి సాంకేతిక విప్లవంతో వేగంగా మారిపోతున్నాయని.. ఈ నేపథ్యంలో న్యాయస్థానాలు సైతం సాంకేతిక పరివర్తనకు దూరంగా ఉండలేవని ఆయన పేర్కొన్నారు. డిజిటలైజేషన్ ద్వారా కోర్టుల్లో కేసుల జాప్యం గణనీయంగా తగ్గుతుందని, సామాన్యులకు న్యాయం మరింత చేరువై ప్రక్రియలు సులభతరమవుతాయని తెలిపారు. అపారమైన సమాచార నిర్వహణ, చట్టపరమైన పరిశోధనల్లో న్యాయమూర్తులకు, సిబ్బందికి ఏఐ సాంకేతికత ఎంతగానో సహాయపడుతుందని, దీనిని పూర్తి సృజనాత్మకతతో స్వాగతించాలని సీజేఐ సూచించారు. అయితే, ప్రతిదీ మారిపోతున్న వేళ ఏవి మారకుండా స్థిరంగా ఉండాలన్న మౌలిక ప్రశ్నను సాంకేతికత మన ముందు ఉంచుతుందని గుర్తుచేశారు. ఈ పరివర్తనలో రాజ్యాంగ న్యాయస్థానాలు కాపాడాల్సిన మానవ గౌరవం, సమానత్వం, స్వేచ్ఛ, నిష్పాక్షికత వంటి మూల విలువలు ఎప్పటికీ కనుమరుగు కాకూడదని ఆయన హెచ్చరించారు. న్యాయస్థానాలు కేవలం కేసులను పరిష్కరించే వేదికలు మాత్రమే కావని, న్యాయవ్యవస్థలో మానవీయ కోణాన్ని, ప్రజల నమ్మకాన్ని కాపాడుతూనే సరికొత్త ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని జస్టిస్ సూర్యకాంత్ పిలుపునిచ్చారు.

# బహుజన రాజ్యాధికార సంకల్ప సభ పోస్టర్ విడుదల

**మాన్యశ్రీ కాన్షీరామ్ 20 వర్ధంతి సభ ను విజయవంతం చేద్దాం**



**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అక్టోబర్ 9న అదిలాబాద్ జోన్ పరిది లో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు బామ్ సెఫ్ , DS4 , BSP వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరామ్ గారి 20 వర్ధంతి ని పురస్కరించుకుని నిర్వహించే బహుజన రాజ్యాధికార సంకల్ప సభ ను విజయవంతం చేయాలని బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జి అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ రోజు జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయం లో జరిగిన జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హజరైన నాయకులకు అసెంబ్లీ ల వారిగా జన సమీకరణ టార్గెట్ ఇచ్చి పోస్టర్ కరపత్రాలు అందించారు. కార్యకర్తలు ఉన్న ప్రతి గ్రామం నుండి ఈ సభ కి జన సమీకరణ చేయాలన్నారు.

**జన్ కళ్యాణ్ దివస్ రిజిస్టర్ ల పంపిణి**

బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ జీ మాయావతి గారి ఆదేశాల మేరకు ఉద్యమ బలోపేతం కోసం బహుజన సమాజం నుండి వనరులు సమీకరించాలని , వాటిని బహుజన ఉద్యమ బలోపేతం కోసం సమీకరించాలని జన్ కళ్యాణ్ దివస్ రిజిస్టర్ లను ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం నాయకులకు అందించారు. ఈ సమావేశం లో పార్లమెంట్ ఇంచార్జి చిర్ర శంకర్ , జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ బొల్లంపెల్లి సంపత్ జిల్లాఉపాధ్యక్షుడు అడ్వకేట్ బిరుదుల లక్ష్మన్ , ప్రధాన కార్యదర్శి రాపర్తి వేణుగోపాల్ , కోరుట్ల అసెంబ్లీ ఇంచార్జి గొర్రె భీమన్న అద్యక్షులు వనతడుపుల మహాతేజ్ , ధర్మపురి అసెంబ్లీ ఇంచార్జ్ నక్క గంగాధర్, అధ్యక్షులు శంకర్, తదితరులు పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా బి.ఎస్.పి అధ్యక్షులు బొల్లంపల్లి సంపత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సభకి హాజరుకావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని చెప్పటం జరిగింది అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని చెప్పటం జరిగింది

# విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం) ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు అందజేశారు. అలాగే, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ అందించారు. నిధులు అందించిన సంస్థల ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం అన్నారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. జీవితకాలం కొనసాగే కార్యక్రమం ఇదని.. కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలని వెల్లడించారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి అయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని ఆదేశించారు. సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ పాల్గొన్నారు.



## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**మెదక్ జిల్లా / రేగోడు ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని, స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ జీ పాత్ర మరువలేనిదని పలువురు పేర్కొన్నారు. రేగోడు మండల కేంద్రంలో ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రభుత్వ , కార్యాలయాలలో ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రేగోడు గాంధీసర్కిల్ వద్ద వివిధ పార్టీ నాయకులు గాంధీవిగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జయంతి



**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మండల కేంద్రంలో మహాత్మా గాంధీ 157వ జయంతి పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ నేతృత్వంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి మహాత్మా గాంధీని స్మరించుకొని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆరే వీరన్న. మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్ యాదవ్. గూడూరు పట్టణ అధ్యక్షులు చీదురు వెంకన్న. మాజీ రైతు కోఆర్డినేటర్ సంపంగి రామచందర్. మాజీ కో ఆప్షన్ మహమ్మద్ రహీం. ప్రచార కార్యదర్శి భూక్య సురేష్ నాయక్. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోడ ఎల్లయ్య. మాజీ పట్టణ అధ్యక్షులు ఏదునూరి వెంకన్న. సీనియర్ నాయకులు సంపంగి రాములు. మాలోత్ రాజారాం. బుర్కా పాపయ్య. తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**మేడిపల్లి,,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, నాయకులు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస,శాంతి మార్గాలు నేటి సమాజానికిస్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం, ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన విధానం చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

## గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఘన నివాళులు



**వికారాబాద్ జిల్లా/చౌడాపూర్ మండల, ఫ్లాష్ ఇండియా :**

ఇండియా ప్రతినిధి మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్, PACS వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గంలో దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం, సత్యం, అహింస వంటి విలువలను సమాజానికి చాటిచెప్పారని గుర్తు చేశారు. అదేవిధంగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి ప్రధానమంత్రిగా సేవలందిస్తూ సరళత, నిజాయితీ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. దేశ భద్రతతో పాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ "జై జవాన్ - జై కిసాన్" అనే నినాదంతో సైనికులు, రైతుల సేవలను దేశానికి గుర్తు చేశారని తెలిపారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చూపిన సత్యం, అహింస, క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం వంటి ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమేష్. చాకలి యాదయ్య. సలీమ్. బి. రాము, వెంకటేష్, నర్సింలు. దండు నరేష్ గోపాల్. వినయ్ కుమార్. ప్రభాకర్. రమేష్. శ్రీను. అంజి. లక్సయ్య. బొర్ర రమేష్. అశోక్. బాలరాజ్. శివ. తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ ఆశయాల దిశగా అడుగులు వేయాలి



**గూడూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కలలను నిజం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విబి జీమ్ రాంజీ చట్టంపై గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించి నూతన చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతంలోని కూలీలకు కల్పించే ఉపాధి పని దినాలను వంద రోజుల నుండి 125 రోజులకు పెంచినట్లు సభకు వివరించి పంచాయతీ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు నేటి సంరక్షణ పనులను గ్రామస్తులందరి సమక్షంలో చర్చించి వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక విజిపిపిలో తీర్మానించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ రోజా రాణి. గూడూరు ఎంపీ ఓ సత్యనారాయణ. ఏవో మాలిక్. పంచాయతీ కార్యదర్శి తిరుమల. కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు చిట్టె వెంకన్న. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి. వార్డు సభ్యులు వాంకుడోత్ శ్రీనివాస్. పత్యం వెంకన్న. గార్లపాటి శిరీష. ధారావత్ కిషన్. గుగులోత్ వినోద. వాంకుడోత్ భద్రమ్మ. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లు వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కళాంజలి సారీ సెంటర్ ను ప్రారంభించిన నూనవత్ రమేష్ నాయక్



**గూడూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మాజీ ఎంపిటిసి అయిలబోయిన సమ్మక్క వీరయ్య ల నూతన కళాంజలి సారీ సెంటర్ ను వేద మంత్రాల నడుమ కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన గూడూరు మాజీ ఎంపీపీ మాజీ సర్పంచ్ నూనవత్ రమేష్ నాయక్. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూడూరు మహిళలకు బతుకమ్మ దసరా పండుగలు విచ్చేస్తున్న సందర్భంలో కళాంజలి సారీ సెంటర్ ప్రారంభించడం సంతోషకరమని అక్కాచెల్లెమ్మలకి అందుబాటులో ఉండడం అభినందనీయమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దారం శ్రీనివాస్. బాలు నాయక్. దారం రమేష్. మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ జన్మదిన వేడుకలు



**మేడ్చల్ కలెక్టరేట్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సత్యాన్ని ఆయుధంగా అహింసను మార్గంగా ఎంచుకొని భారత దేశానికి స్వాతంత్రాన్ని అందించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా అధికారులు హౌసింగ్ పీడీ సిద్ధార్థ ఎల్ డి ఎం శివప్రసాద్ లు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు ప్రభుత్వ సాయం అండ



**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు రూ. 50.64 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే ఎలిగేడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ. 13,01,508 విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలిగేడు తహసీల్దార్ యాకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, సింగిల్‌విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కొమురయ్య ,వెంకటేష్ ,ప్రవీణ్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మేచినేని వంశీకృష్ణ రావు ,నర్నేని సుధాకర్ రావు,కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకం




**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ధూళికట్ట గ్రామంలో శుక్రవారం వీబీజీ రాంజీ పథకంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు డీఆర్డీఏ పీడీ కాళిందిని ముఖ్య అతిథిగా హాజరై పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా పీడీ కాళిందిని మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టేందుకు ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. గ్రామసభలో ప్రజల అవసరాలను తెలుసుకుని, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన పనులను గుర్తించాలని అధికారులకు సూచించారు. అలాగే అర్హత ఉన్నప్పటికీ జాబ్‌కార్డులు లేని కుటుంబాలకు దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, మౌలిక వసతులు తదితర సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చి తీర్మానాల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం గ్రామానికి అవసరమైన పలు అభివృద్ధి పనులపై గ్రామసభలో చర్చించి ప్రాధాన్యతలను గుర్తించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య యాదవ్,ఎంపీడీవో భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి అజ్మీర జ్యోతి, ఉపసర్పంచ్ ఆండాలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## గోడుకొండ్లలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

గోడుకొండ్లలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు గాంధీ జయంతి సందర్భంగా గోడుకొండ్ల గ్రామ పంచాయతీలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గౌరవ శ్రీ కాశగోని వెంకటయ్య గారు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత , గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సత్యం, అహింస మార్గాలు అందరికీ ఆదర్శం




**రామచంద్రాపురం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, ధర్మం, సహనం, అహింస మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని శాసన మండలి మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సత్యం, అహింస, సహనం, ధర్మం వంటి విలువలను తన జీవితంలో ఆచరించి చూపిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. యువత గాంధీజీ ఆశయాలను తెలుసుకుని సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, నైతిక విలువలను పెంపొందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం గాంధీ బాలవిహార్ పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, పరమేష్ యాదవ్, కుమార్ గౌడ్, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో ఘన సన్మానం



**నల్లగొండ జిల్లా /చింతపల్లి ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దేవరకొండ పట్టణంలోని ఐబీ వద్ద పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నరసింహ మాట్లాడుతూ.. సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. ఎండ, వానను లెక్కచేయకుండా ప్రజారోగ్యం కోసం నిరంతరం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేయాలనే సందేశాన్ని అందిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నక్క వెంకటేష్ యాదవ్, బీజేపీ నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, నేతల వెంకటేష్ యాదవ్, మండల అధ్యక్షులు రాము నాయక్ చండీశ్వర్, రెడ్డి శంకర్, సముద్రాల సహదేవులు, కసుల శంకరయ్య, గంజి హరి, జూలూరు శ్రీను, ఎర్ర యాదయ్య, జయరాం, లక్ష్మణ్, వీరేష్, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# టీమిండియా కెప్టెన్ ఆసక్తికర వ్యాఖ్యలు!

భారత అండర్-19 జట్టు 2026 ప్రపంచ కప్‌లో సత్తా చాటిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్‌ను ఫైనల్లో 100 పరుగుల తేడాతో ఓడించి ఆరోసారి అండర్-19 ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో భారత్ అత్యధికసార్లు అండర్-19 ప్రపంచ కప్ గెలిచిన జట్టుగా తన రికార్డును మరింత మెరుగుపర్చుకుంది. ఈ విజయ ప్రస్థానంలో కెప్టెన్ అయుష్ మాత్రేతో పాటు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కీలక పాత్ర పోషించారు. ఈ టోర్నీకి ముందు కెప్టెన్ అయుష్ మాత్రేకు టీమిండియా మాజీ సారథి, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ కీలక సూచనలు ఇచ్చాడు. ఈ విషయాన్ని అయుష్ తాజాగా స్వయంగా వెల్లడించాడు. తనకు నాయకత్వంపై రోహిత్ భాయ్ ఎన్నో విషయాలు చెప్పాడని వెల్లడించాడు. 'ఐపీఎల్ అనంతరం నేను అండర్-19 జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యా. నాయకత్వ బాధ్యతలపై నాకు పెద్దగా అవగాహన లేదు. దీంతో రోహిత్ శర్మను సంప్రదించాలని నిర్ణయించుకున్నా. రోహిత్‌కు మెసేజ్ చేయగా.. ఎప్పుడు కావాలంటే అప్పుడు కాల్ లేదా మెసేజ్ చేయొచ్చని చెప్పాడు' అని అయుష్ వెల్లడించాడు. 'ఆ తర్వాత రోహిత్‌ను వ్యక్తిగతంగా కలవాలని కోరాను. నన్ను ఇంటికి రావాలని ఆహ్వానించాడు. రోహిత్‌తో చాలా సమయం నాయకత్వానికి సంబంధించిన విషయాలపై మాట్లాడాను. కెప్టెన్‌గా జట్టును ఎలా నడిపించాలి, ఆటగాళ్లను ఎలా హ్యాండిల్ చేయాలి వంటి విషయాలను చాలా చక్కగా నాకు వివరించాడు. ఎంతో సమయం కేటాయించి నాతో మాట్లాడాడు. నా తండ్రితో కూడా దాదాపు అరగంట మాట్లాడాడు. రోహిత్ చాలా వినయంగా ఉంటాడు. ఎప్పుడూ మాట్లాడేందుకు అందుబాటులో ఉంటాడు' అని అయుష్ మాత్రే చెప్పుకొచ్చాడు. కెప్టెన్సీకి సంబంధించిన సూచనలతో పాటు రోహిత్ ఇచ్చిన ప్రోత్సాహం కూడా తనకు ఎంతో ఉపయోగపడిందని అయుష్ చెప్పాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఐపీఎల్‌లో తన ప్రయాణం గురించి కూడా అయుష్ మాత్రే ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. 'దిగ్గజ క్రికెటర్ ఎంఎస్ ధోనీని తొలిసారి చూసినప్పుడు భయపడ్డా. నిజమే చెపుతున్నా మాహీ భాయ్‌ను తొలిసారి ప్రత్యక్షంగా చూసినప్పుడు ఓ రకమైన భయంతో అలా చూస్తుండిపోయా. ఇప్పటికీ అలానే ఉంటుంది అనుకోండి. ఆయన చాలా స్వేచ్ఛగా మాట్లాడతారు. మహీ భాయ్ ఒక లెజెండ్. ఆయనతో ఫొటో దిగాలని అనుకున్నా.. ఎలా దగ్గరకు వెళ్లాలో అర్థం కాలేదు. ట్రయల్స్ చివరి రోజు ధైర్యం చేసి వెళ్లి ఫొటో దిగాను. అయితే అప్పట్లో ధోనీతో నేను పెద్దగా మాట్లాడలేదు' అని అయుష్ తెలిపాడు. 2025లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వచ్చిన అయుష్ ఇప్పటివరకు 13 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మ్యాచ్‌ల్లో 441 పరుగులు చేశాడు. అతడి అత్యధిక స్కోరు 94. అండర్-19 ప్రపంచ కప్ విజయంతో మరింత గుర్తింపు తెచ్చుకున్న అయుష్.. రాబోయే ఐపీఎల్ సీజన్‌లోనూ తన సత్తా చాటాలని చూస్తున్నాడు.

# అతడు మరింత పదునెక్కుతున్నాడు..



భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో రికార్డు డబుల్ సెంచరీతో చెలరేగిన విషయం తెలిసిందే. గువాహటిలో జరిగిన ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. గిల్ 133 బంతుల్లోనే 223 పరుగులతో అజేయంగా నిలిచి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌పై మాజీ భారత క్రికెటర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించారు. హర్భజన్ సింగ్ మాట్లాడుతూ.. 'కాలం గడిచేకొద్దీ శుభ్‌మన్ గిల్ ఆట మరింత మెరుగవుతోంది. అండర్-19 రోజుల నుంచి గిల్ ఆటను గమనిస్తున్నా. అనుభవం పెరిగిన కొద్దీ అతడి బ్యాటింగ్‌లో మరింత పరిణతి కనిపిస్తోంది. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా గిల్ అద్భుతంగా రాణిస్తున్నాడు. గిల్ సాధించిన విజయాల వెనుక అతడి కష్టంతో పాటు తండ్రి పాత్ర కూడా ఎంతో ఉంది. ఇంత చిన్న వయసులోనే గిల్ సాధిస్తున్న ఘనతలు గర్వంగా అనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇంత వేగంగా డబుల్ సెంచరీ సాధించడం అసాధారణం. గిల్‌కు, అతడి తండ్రికి అభినందనలు' చెపారు. వెస్టిండీస్‌పై శుభ్‌మన్ గిల్ కేవలం 117 బంతుల్లో డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. దీంతో వన్డేల్లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు ఇషాన్ కిషన్ పేరిట ఉండేది. బంగ్లాదేశ్‌పై 2022లో ఇషాన్ 126 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాడు. ఈ డబుల్ సెంచరీతో గిల్ మరో అరుదైన ఘనతను కూడా అందుకున్నాడు. వన్డేల్లో రెండుసార్లు డబుల్ సెంచరీ సాధించిన భారత బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ తర్వాత గిల్ రెండో ఆటగాడిగా నిలిచాడు. గిల్ 2023లో న్యూజిలాండ్‌పై 208 పరుగులతో తొలి వన్డే డబుల్ సెంచరీ సాధించాడు. ఇప్పుడు వెస్టిండీస్‌పై 223 పరుగులతో రెండో డబుల్ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. అంతేకాకుండా విజయవంతమైన వన్డే ఛేజింగ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా కూడా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. ఈ విషయంలో గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. మ్యాక్స్‌వెల్ 2023 వన్డే ప్రపంచ కప్‌లో అఫ్గానిస్థాన్‌పై 201 పరుగులతో అజేయంగా నిలిచాడు. గిల్ మరో అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్టులు, వన్డేల్లో కెప్టెన్‌గా డబుల్ సెంచరీలు చేసిన తొలి క్రికెటర్‌గా నిలిచాడు. గత ఏడాది ఇంగ్లండ్‌పై ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో గిల్ 269 పరుగులు చేసిన విషయం తెలిసిందే. తాజాగా వన్డేల్లోనూ డబుల్ సెంచరీ సాధించడంతో ఈ ప్రత్యేక ఘనత అతడి సొంతమైంది. వెస్టిండీస్‌పై 223 పరుగులతో శుభ్‌మన్ గిల్.. భారత కెప్టెన్‌గా వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా కూడా నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డు వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉండేది. సెహ్వాగ్ 2011లో వెస్టిండీస్‌పైనే 219 పరుగులు చేశాడు. ఈ ఏడాది వన్డేల్లో గిల్ అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతున్నాడు. 11 మ్యాచ్‌ల్లో 10 ఇన్నింగ్స్‌లు ఆడిన అతడు 894 పరుగులు చేశాడు. 127.71 సగటుతో పాటు 119.51 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు బాదాడు. ఇందులో మూడు సెంచరీలు, ఐదు అర్ధసెంచరీలు ఉన్నాయి. మొత్తంగా 69 వన్డేల్లో 68 ఇన్నింగ్స్‌లు ఆడిన గిల్.. 3,712 పరుగులు సాధించాడు. అతడి ఖాతాలో 11 సెంచరీలు, 20 అర్ధసెంచరీలు ఉన్నాయి.



# భారత్, పాకిస్థాన్ మూడు సార్లు ఢీకొట్టే ఛాన్స్..

ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2027 షెడ్యూల్ విడుదలైంది. ప్రధాన టోర్నీ అక్టోబరు 7న ఆరంభం కానుండగా.. ఫైనల్ నవంబరు 21న జరుగుతుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న ఈ మెగా టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొంటున్నాయి. జట్లను రెండు గ్రూపులుగా విభజించగా.. ఒక్కో గ్రూపులో ఆరు జట్లు ఉన్నాయి. భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, జింబాబ్వే, అఫ్గానిస్థాన్ గ్రూప్-ఏలో ఉన్నాయి. క్వాలిఫయర్-ఏ నుంచి మరో జట్టు ఈ గ్రూపులో చేరనుంది.

**గ్రూప్ దశలో తొలి పోరు:**

భారత్ అక్టోబర్ 7న ఆస్ట్రేలియాతో మ్యాచ్‌తో ప్రపంచ కప్ ప్రస్థానాన్ని ప్రారంభించనుంది. ఆ తర్వాత అక్టోబర్ 10న జోహన్నెస్‌బర్గ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. అయితే 2027 ప్రపంచ కప్ ఫార్మాట్ కారణంగా భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే టోర్నీలో ఏకంగా మూడు సార్లు తలపడే అవకాశం ఉంది. భారత్, పాకిస్థాన్ మధ్య తొలి మ్యాచ్ అక్టోబర్ 10న గ్రూప్-ఏలో భాగంగా జరగనుంది. గ్రూప్ దశలో ప్రతి జట్టు తమ గ్రూపులోని ఇతర జట్లతో తలపడుతుంది. ఈ దశ ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్‌లోని టాప్-3 జట్లు తదుపరి దశకు అర్హత సాధిస్తాయి. రెండు గ్రూపుల్లో నాలుగో స్థానంలో నిలిచిన జట్లలో మెరుగైన రికార్డు ఉన్న జట్టుకు కూడా సూపర్-7లో చోటు లభిస్తుంది.

**సూపర్-7లో మరోసారి:**

గ్రూప్ దశ తర్వాత సూపర్-7 దశ ప్రారంభమవుతుంది. ఈ దశలో ఏడు జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో ఆడతాయి. గ్రూప్ దశలో సాధించిన పాయింట్లు సూపర్-7కు బదిలీ కావు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 14 వరకు జరిగే ఈ దశలో ప్రతి జట్టు మరో ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. భారత్, పాకిస్థాన్ జట్లు సూపర్-7కు అర్హత సాధిస్తే.. ఇక్కడ కూడా ఒకసారి తలపడే అవకాశం ఉంటుంది.

**సెమీస్ లేదా ఫైనల్లో మూడోసారి:**

సూపర్-7 దశ ముగిసిన తర్వాత టాప్-4 జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. భారత్, పాకిస్థాన్ రెండు జట్లు టాప్-4లో నిలిస్తే.. సెమీఫైనల్‌లో లేదా ఫైనల్లో మరోసారి ముఖాముఖి అయ్యే అవకాశం ఉంటుంది. అంటే రెండు జట్లు టోర్నీలో గరిష్ఠంగా మూడు సార్లు తలపడే అవకాశం ఉందన్నమాట. ప్రస్తుత ఫార్మాట్ ప్రకారం.. గ్రూప్ దశ, సూపర్-7 దశ, ఆ తర్వాత నాకౌట్ దశలో భారత్-పాకిస్థాన్ పోరు జరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే మూడు మ్యాచ్‌లు జరగాలంటే రెండు జట్లు ఆయా దశలకు అర్హత సాధించాల్సి ఉంటుంది.

**విశ్వవిజేతగా నిలవాలని:**

2023 వన్డే ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా ఛాంపియన్‌గా నిలిచింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో భారత్‌ను ఆరు వికెట్ల తేడాతో ఓడించి ఆస్ట్రేలియా టైటిల్ సాధించింది. ఈసారి విశ్వవిజేతగా నిలవాలని టీమిండియా చూస్తోంది. దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు మీ టోర్నీలో ఆడనున్నారు. పాకిస్థాన్ మాత్రం 2023 ప్రపంచ కప్‌లో తొమ్మిది మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు, ఐదు ఓటములతో ఐదో స్థానంలో నిలిచింది. 2023 ప్రపంచ కప్‌లో 10 జట్లు పాల్గొనగా.. 2027 టోర్నీలో 12 జట్లు బరిలోకి దిగనున్నాయి.

# బిజినెస్

## జీఎస్‌టీ వసూళ్ల జోరు




సెప్టెంబరు నెలలో స్థూల జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 14.7 పెరిగి రూ.2.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయంగా వినియోగం మరింత పుంజుకోవడంతో పాటు దిగుమతులపై పన్ను రాబడిలో బలమైన వృద్ధి ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయి. కేంద్ర ఆర్థిక శాఖ గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. సెప్టెంబరులో దేశీయంగా ఆర్థిక కార్యకలాపాల నుంచి స్థూల జీఎస్‌టీ వసూళ్లు 10.1 పెరుగుదలతో రూ.1.38 లక్షల కోట్లకు చేరాయి. దిగుమతులపై జీఎస్‌టీ ఆదాయం 26 వృద్ధి చెంది రూ.65,525 కోట్లుగా నమోదైంది. అంతర్జాతీయ ప్రతికూలతల్లోనూ దేశీయంగా వినియోగం చురుకుగా సాగుతుందనడానికిది సంకేతమని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ ఆదాయం రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాడటం ఇది మూడోసారి. ఈ ఏప్రిల్‌లో ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి రూ.2.43 లక్షల కోట్లు, జూలైలో రూ.2.11 లక్షల కోట్లుగా నమోదైంది.

**నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.76 లక్షల కోట్లు**

గత నెలలో జీఎస్‌టీ రిఫండ్లు వార్షిక ప్రాతిపదికన 3 తగ్గి రూ.27,001 కోట్లకు పరిమితమయ్యాయి. రిఫండ్లు మినహాయించగా నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.76 లక్షల కోట్లు నమోదైంది. 2025 సెప్టెంబరులో నమోదైన రూ.1.49 లక్షల కోట్లతో పోలిస్తే 18.1 అధికం.

**ప్రథమార్థం వసూళ్లు రూ.12.46 లక్షల కోట్లు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్థానికి స్థూల జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 11.6 శాతం వృద్ధితో రూ.12.46 లక్షల కోట్లకు చేరాయి. నికర వసూళ్లు 10.4 శాతం పెరుగుదలతో రూ.10.66 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

**తెలంగాణ జీఎస్‌టీ ఆదాయంలో 18% వృద్ధి**

సెప్టెంబరులో తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం రూ.5,327 కోట్లకు పెరిగింది. 2025 సెప్టెంబరు రాబడి రూ.4,512 కోట్లతో పోలిస్తే 18 వృద్ధి నమోదైంది.

# అంచనాలకు అందని బంగారం



భారత్‌లో బంగారం ధరల అంచనాలకు అందని రీతిలో మారుతున్నాయి. ఒక రోజు పెరిగితే ఆ మరుసటి రోజే తగ్గుతున్నాయి. నిన్న కాస్త తగ్గిన ధరలు నేడు మళ్లీ ఎగబాకాయి. మేలిమి బంగారం ధర రూ.1040 మేర పెరిగింది. అంతర్జాతీయ అనిశ్చితులు, డాలర్ బలపడటం వంటి కారణాలతో ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,040 మేర పెరిగి రూ.1,50,280కు చేరింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.950 మేర ఎగబాకి రూ.1,37,750కు పెరిగింది. వెండి ధర మాత్రం ఈ వారం దాదాపు స్థిరంగానే కొనసాగుతోంది. నగరంలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.4 లక్షలుగా ఉంది.



# కేవలం రూ. 299కే జియోభారత్ ఫోన్

రిలయన్స్ జియో 10 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా, 2జీ వినియోగదారులను 4జీ వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా జియోభారత్ 4జీ ఫీచర్ ఫోన్‌ను కేవలం రూ. 299 ఎఫెక్టివ్ ధరకే అందిస్తోంది. దీనికోసం వినియోగదారులు మొదట రూ. 1,499 చెల్లించి ఈ ఫోన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే, దీంతో పాటు ఆరు నెలల పాటు ఉచితంగా లభించే రీఛార్జ్ ప్యాక్ విలువ రూ. 1,200 వరకు ఉంటుంది. సాధారణంగా 2జీ వినియోగదారులు ఆరు నెలల రీఛార్జ్‌ల కోసం ఎలాగూ రూ. 1,200 ఖర్చు చేస్తారు కాబట్టి, ఆ మొత్తాన్ని ఫోన్ ధర నుండి మినహాయిస్తే ఫోన్ అసలు ధర రూ. 299 మాత్రమే పడుతుందని జియో భావిస్తోంది. ఈ పండుగ సీజన్ ఆఫర్ కింద యూజర్లకు నెలకు 14జీబీ డేటా, అపరిమిత హెచ్‌డీ వాయిస్ కాల్స్ ఉచితంగా లభిస్తాయి. 2,000ఎంఏహెచ్ బ్యాటరీతో వచ్చే ఈ ఫోన్ కేవలం కాలింగ్, టెక్స్టింగ్‌కే పరిమితం కాకుండా, జియోటీవీ ద్వారా 500కి పైగా టీవీ ఛానెళ్లు, జియోహాట్‌స్టార్‌లో లైవ్ క్రికెట్, సినిమాలు చూసే వెసులుబాటు ఉంది.



# నిల్వలపై కేంద్రం కొత్త నిబంధనలు

షుగర్ ధరలు అమాంతం పెరిగిపోయాయి.. ఆ తర్వాత వాటికి కళ్లెం వేసేందుకు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడంతో.. కొంత మేర దిగివచ్చాయి.. ఇక, పండుగ సీజన్ నేపథ్యంలో చక్కెర ధరలు, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చక్కెర నిల్వలు పేరుకుపోకుండా, హోర్డింగ్, ఊహాజనిత వ్యాపారం, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టే ఉద్దేశంతో వ్యాపారుల స్టాక్ హోల్డింగ్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. కొత్త నిబంధనలు అక్టోబర్ 15, 2026 నుంచి నవంబర్ 30, 2026 వరకు అమల్లో ఉంటాయి. కొత్త నిబంధనల ప్రకారం దేశంలోని సాధారణ ప్రాంతాల్లో చక్కెర డీలర్లు ఒకేసారి గరిష్ఠంగా 1,000 క్వింటాళ్ల వరకు మాత్రమే నిల్వ ఉంచుకోవచ్చు. అలాగే, డీలర్‌కు చక్కెర నిల్వ వచ్చిన తేదీ నుంచి 15 రోజులకు మించి ఆ స్టాక్‌ను ఉంచకూడదు. నిర్ణీత కాలంలో నిల్వను మార్కెట్‌లోకి విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. కోల్‌కతా, దాని విస్తరించిన మెట్రోపాలిటన్ ప్రాంతాలు, అస్సాంలో డీలర్లు ఒకేసారి 2,000 క్వింటాళ్ల వరకు చక్కెర నిల్వ చేసుకోవచ్చు. ఈ ప్రాంతాల్లో మార్కెట్ అవసరాలు, రవాణా సవాళ్లు, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక పరిమితిని నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. పండుగల సమయంలో చక్కెరకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సరఫరా చైన్‌లో అధికంగా నిల్వలు పేరుకుపోకుండా చూడటమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం. మిల్లుల నుంచి డీలర్లు, అక్కడి నుంచి వినియోగదారుల వరకు చక్కెర సజావుగా చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇదిలా ఉండగా, ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు గరిష్ఠ స్థాయి నుంచి చక్కెర సగటు రిటైల్ ధర సుమారు 15 శాతం తగ్గింది. ఎక్స్-మిల్ ధరలు దాదాపు 28 శాతం తగ్గాయి. గత మూడు వారాలుగా ఎక్స్-మిల్ ధరలు స్థిరంగా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ ధర తగ్గుదల ప్రయోజనం వినియోగదారులకు అందేలా టోకు, చిల్లర వ్యాపారులు చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త చక్కెర సీజన్ అక్టోబర్ 1న ప్రారంభమైన నేపథ్యంలో చెరకు లభ్యత, పంట పరిస్థితులు, వాతావరణ పరిస్థితులను బట్టి షుగర్ మిల్లులు క్రషింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, చక్కెర మిల్లులు సమన్వయంతో పనిచేసి చక్కెర ఉత్పత్తి, సరఫరా సజావుగా జరిగేలా చూడాలని కేంద్రం కోరింది. కొన్ని చక్కెర ఉత్పత్తి ప్రాంతాల్లో తక్కువ లేదా అస్థిర వర్షపాతం ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. వాతావరణ పరిస్థితులు, చెరకు దిగుబడులు భవిష్యత్ చక్కెర లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో.. వినియోగదారులు, చెరకు రైతులు, చక్కెర పరిశ్రమ ప్రయోజనాల మధ్య సమతుల్యత కొనసాగిస్తూ మార్కెట్‌లో తగినంత చక్కెర అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది కేంద్రం..

# Krithi Shetty



## లోపాలే వెతుకుతారు..

టాలీవుడ్‌లో ఛాన్సులు తగ్గినప్పటికీ, ప్రస్తుతం కోలీవుడ్ వైపు అడుగులు వేస్తోంది. అక్కడ రవిమోహన్ సరసన 'జీనీ' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తూ బిజీగా గడుపుతోంది. ఈనేపథ్యంలో, తాజాగా సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సమాజంలో, అలాగే వెండితెరపై పురుషులు తాము చేసే పనులకు పెద్దగా నిరూపించుకోవాల్సిన అవసరం లేదని, వారిని జనం త్వరగా ఇష్టపడిపోతారని కృతి చెప్పుకొచ్చింది. కానీ ఒక మహిళ ఎంత పరిపూర్ణంగా, పర్ఫెక్ట్‌గా ఉన్నప్పటికీ, జనాలు మాత్రం ఎప్పుడూ ఆమెలో ఏదో ఒక లోపాన్ని వెతుకుతూనే ఉంటారంటూ ఆమె తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేసింది. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, మహిళల పట్ల సమాజంలో ఉన్న వివక్షపై ఆమె చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ఏదేమైనా కృతి శెట్టి చేసిన ఈ తాజా కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

# పెద్ద హీరోయిన్ కావాలనే కోరిక లేదు..

బ్లాస్ట్' సినిమాతో బాక్సాఫీసు వద్ద బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టి టాలీవుడ్‌ను ఒక ఊపు ఊపిన యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఊహించని రేంజ్‌లో పాపులారిటీ తెచ్చుకున్న ఈ అమ్మడు.. ప్రస్తుతం వరుస క్రేజీ ఆఫర్లతో తెలుగు, తమిళ భాషల్లో దూసుకుపోతోంది. ప్రస్తుతం ఆమె చేతిలో 'ఏమో ఏమో ఇది', ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న 'D-56' వంటి భారీ ప్రాజెక్ట్‌లు ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రీతి ముకుందన్ తన మనసులోని మాటలను చాలా ఓపెన్‌గా పంచుకున్నారు. తనకు టాలీవుడ్‌లో ఒక స్టార్ లేదా పెద్ద హీరోయిన్ కావాలనే కోరిక ఏమాత్రం లేదని ఆమె స్పష్టం చేశారు.కేవలం గ్లామర్ పాత్రల ద్వారా వచ్చే ఇమేజ్ కంటే, తాను నటించే పాత్ర ఎంత ప్రభావం చూపుతుందనేదే తనకు అత్యంత ముఖ్యమని ఆమె చెప్పుకొచ్చారు. పెద్ద హీరోయిన్ అనే ట్యాగ్ తెచ్చుకోవడంలో తనకు అసలు ఆసక్తి లేదని, తాను ఒకే ఒక్క సినిమాలో నటించినా సరే ఆ మూవీలో తన పాత్ర ప్రేక్షకుడి మనసులో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉండాలని ఆమె తెలిపారు. కథలో ఆ పాత్రకు తగిన ప్రాముఖ్యత ఉండాలి తప్ప, కేవలం ఇమేజ్ కోసం మాత్రం తాను నటించనని తేల్చిచెప్పారు. గ్లామర్ రోల్స్ కంటే నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రల వైపే తన మొగ్గు చూపుతానని ఆమె చెప్పిన మాటలు ప్రస్తుతం ఇండస్ట్రీలో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. కేవలం స్టార్‌డమ్ కాకుండా మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనే ఆమె ఆలోచనపై సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి.



# కల్ట్ మంత్ బిగిన్స్ అంటూ క్రేజీ అప్డేట్ ఇచ్చిన విశ్వక్ సేన్




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ డైరెక్షన్‌లో తెరకెక్కుతోన్న ఇండియా తొలి స్లాషర్ మూవీ 'కల్ట్'. ఇందులో విశ్వక్ 'గేమ్ మాస్టర్' అనే పాత్రలో కనిపించబోతుండగా.. గాయత్రి భరద్వాజ్ హీరోయిన్‌గా నటిస్తుంది. మురళీ శర్మ, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గోవాలో జరిగే ఓ పార్టీ అకస్మాత్తుగా బ్లడ్‌బాత్‌గా (రక్తపాతంగా) మారడం, ప్రాణాలతో బయటపడటానికి ఒక ప్రాణాంతకమైన ఆడ ఆడాల్సి రావడం ఈ సినిమా ప్రధాన కథాంశం. ఇది వియత్నాంలో జరిగిన నిజ సంఘటనల ఆధారంగా తెరకెక్కబోతుండగా.. ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో భారీ అంచనాల మధ్య కల్ట్ చిత్రం అక్టోబర్ 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. రిలీజ్ సమయం దగ్గర పడుతున్న క్రమంలోనే తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చాడు విశ్వక్. ఈ మేరకు ఓ సరికొత్త పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'కల్ట్ నెల ప్రారంభమైంది..' అనే చిన్న క్యాప్షన్‌తో ఈ మూవీ నుంచి వరుస అప్డేట్స్ రాబోతున్నట్లు హింట్ ఇచ్చాడు విశ్వక్.

# కార్తీపై గుర్రుగా ఉన్న...




తమిళనాడులో ఓటీటీ రిలీజ్ విండో విషయంలో సమస్య కొలిక్కి రాలేదు. 8 వారాల విండో అని మరొకరు, 4 వారాల విండో అని మరొకరు ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. స్ట్రైక్ వరకు వెళ్లింది.. ప్రభుత్వం కలగజేసుకుని సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ప్రస్తుతానికి కామ్ అయ్యింది ఇండస్ట్రీ. కానీ కార్తీ మాత్రం ఈ లెక్కలేమీ పట్టించుకున్నట్లు లేదు. ఫ్లాప్ సినిమాలకు అన్ని రోజులు కూడా అనవసరం అనుకున్నాడేమో.. 4 వారాల లోపే సినిమాలు ఓటీటీ ఇచ్చేసి అందర్ని షాక్‌కు గురి చేశాడు.కార్తీ రీసెంట్లీ సర్దార్2తో హాయ్ చెప్పాడు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో సర్దార్ సీక్వెల్‌గా వచ్చిన ఈ మూవీ ఆడియన్స్ అంచనాలు అందుకోవడంలో తడబడింది. అదే రోజు రిలీజైన సూరి, సుహాస్ మూవీ "మండాడి "ఇంకా థియేటర్స్‌లో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోన్న టైంలో సర్దార్2 ఓటీటీలో సందడి చేస్తోంది. సెప్టెంబర్ 10న రిలీజైన ఈ మూవీ 20 రోజుల్లోనే డిజిటల్ ఫ్లాట్ ఫామ్‌పై సందడి చేస్తోంది. సర్దార్2 బెటర్.. రిలీజైన మూడు వారాల్లో వస్తే.. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన వా వాతియార్ అయితే కేవలం 14 రోజుల్లోనే ఓటీటీ బాట పట్టింది. ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన ఈ మూవీబాక్సాఫీస్ దగ్గర దారుణమైన రిజల్ట్ చూసింది.తమిళనాడులో ఇటు డిస్ట్రిబ్యూటర్స్ అటు థియేటర్ ఓనర్స్ 8 వారాల విండో కోసం పోరాటం నిర్మాతలు నష్టపోతామని ఫైట్ చేస్తుంటే ఈవేమీ పట్టించుకోకుండా వీరి వాదనలకు భిన్నంగా ఓటీటీలోకి సినిమాలు తెస్తున్నాడు. కార్తీ ఇలా చేస్తే భవిష్యత్తులో అతడి కెరీర్‌కే ముప్పు అంటున్నారు ట్రేడ్ పండితులు. ఎలాగూ తక్కువ టైంలోనే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి కదా అని అతడి సినిమాలను థియేటర్స్‌కు వెళ్లి చూసేందుకు జనాలు ఇష్టపడరన్నది వారి వాదన. కార్తీ ఇలాంటి కామెంట్స్ సీరియస్‌గా తీసుకుంటాడా..?

# పవర్ ఫుల్ పాత్రలో ఫాతిమా?



బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుని, వైవిధ్యమైన పాత్రలతో ఎప్పుడూ ప్రయోగాలు చేసే టాలెంటెడ్ బ్యూటీ ఫాతిమా సనా షేక్. 'దంగల్' సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా, ఆ తర్వాత మెయిన్ హీరోయిన్‌గా అడుగుపెట్టి తన అద్భుతమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథా బలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకెళ్తున్న ఈ అమ్మడు ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న ముంబై అండర్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్ మూవీ 'పోలీస్ కంపెనీ'లో ఫాతిమా సనా షేక్ పవర్ ఫుల్ పాత్రలో నటించబోతున్నట్లు టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.ఇక ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాలో ఫాతిమా సనా షేక్ పాత్ర అత్యంత శక్తివంతంగా ఉండబోతుందట. ఈ ప్రాజెక్ట్‌లో ఆమె పాత్ర సినిమాకే హైలైట్ కానుందని టాక్. వైవిధ్యమైన నటనతో మెప్పించే ఫాతిమా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ఎలాంటి షాకింగ్ పెర్ఫార్మెన్స్ ఇస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 'ఇట్ ఈజ్ మోర్ డేంజరస్ దెన్ డి కంపెనీ' అనే ఇంటెన్స్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాను ఆర్జీవి క్రైమ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. 1990ల చివరలో, 2000ల ప్రారంభంలో ముంబైని గడగడలాడించిన గ్యాంగ్‌వార్స్, వాటిని అణచివేయడానికి ఏర్పాటైన ప్రత్యేక పోలీస్ ఎన్‌కౌంటర్ స్క్వాడ్ కథాంశంతో ఇది తెరకెక్కుతోంది. ముఖ్యంగా రియల్ లైఫ్ పోలీస్ ఆఫీసర్ దయా నాయక్ సాహసాల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో, హీరో హర్షవర్ధన్ రాణే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. టిసిరీస్ నిర్మిస్తోంది.

# ఈసారి భయంతో పాటు నవ్వులు కూడా..




శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రలో నటించబోతున్న లేటెస్ట్ హారర్ మూవీ 'స్త్రీ-3'. భారీ విజయాన్ని అందుకున్న 'స్త్రీ' హారర్-కామెడీ ఫ్రాంచైజీ నుంచి మూడవ భాగంగా రాబోతున్న ఈ ప్రాజెక్టుపై లేటెస్ట్ అప్డేట్ ఇచ్చాడు నిర్మాత దినేష్ విజన్. ముంబైలో జరిగిన 'FICCI Frames 2026' ఈవెంట్‌లో పాల్గొన్న ఈయన 'స్త్రీ-3' గురించి మాట్లాడుతూ.. దర్శకుడు అమర్ కౌశిక్ ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పూర్తి చేశారు. ఈ కథ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందిస్తుంది. వచ్చే ఏడాది చివర్లో 'స్త్రీ-3' షూటింగ్ ప్రారంభం కానుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2028 క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నాము. మాడాక్ హారర్ కామెడీ యూనివర్స్ నుంచి వస్తోన్న 'స్త్రీ 3'తో ఈసారి భయంతో పాటు నవ్వుల మోత మరింత గట్టిగానే ఉండబోతోంది' అని అఫీషియల్‌గా ప్రకటించారు. పంకజ్ త్రిపాఠి, అపారశక్తి ఖురానా, అభిషేక్ బెనర్జీలు యథావిధిగా తమ పాత్రల్లో అలరించనుండగా.. ఈ సినిమా కథ ఎక్కడ మొదలై ఎక్కడ ముగుస్తుందో ఊహించడం కష్టమని, ఇది ప్రేక్షకులకు ఒక మైండ్ బ్లోయింగ్ సర్ప్రైజ్‌లా ఉంటుందని నిర్మాత దినేష్ విజన్ చేసిన కామెంట్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి.

# దేశం గర్వించదగ్గ నటుడు అతడే..



మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ క్రేజీ మూవీ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. ఈ చిత్రంతో శశాంక్ యేలేటి దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ నేడు (అక్టోబర్ 2) తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ కాగా.. మూవీపై ప్రేక్షకుల్లో భారీ హైప్ నెలకొంది. కాగా.. సారా పాలేకర్, సౌరభ్ సచ్‌దేవ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్‌పై బాహుబలి నిర్మాత శోభు యార్లగడ్డతో పాటు, ఎస్.ఎస్. రాజమౌళి కుమారుడు ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా నిర్మించారు. ఇక ఈ మూవీ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఎన్టీఆర్ మాట్లాడుతూ.. 'నాకు అతి తక్కువ మంది యాక్టర్స్ ఇష్టం. అందులో మొదటి వ్యక్తి ఫాహద్ ఫాజిల్. దేశం గర్వించదగ్గ నటుడు ఫాహద్. ఆయన తెలుగులో మొదటిసారి లీడ్ యాక్టర్‌గా చేస్తున్న ఈ సినిమా ఆయనకు మంచి విజయాన్ని ఇవ్వాలి. దర్శకుడిగా శశాంక్ మొదటి సినిమా ఈ డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. ఈ సినిమా ఆయనకు గొప్ప విజయం అందించాలని కోరుకుంటున్నా' అని తెలిపాడు.



# రిలీజ్‌కు పక్కా ప్లాన్

రామ్ చరణ్, లెక్కల మాస్టారు సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ 'ఆర్సీ 17'. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులు, అభిమానుల్లో అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. పైగా పుష్ప2 వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ తర్వాత సుకుమార్ చేస్తున్న సినిమా కావడంతో యావత్ ప్రపంచం ఆర్సీ 17 అప్డేట్ కోసం ఎదురు చూస్తోంది. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్‌తో బిజీగా ఉన్నాడు సుక్కు.ఈ సినిమాకి సంబంధించిన లేటెస్ట్ షెడ్యూల్ ప్లానింగ్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ అక్టోబర్ 20 అనగా విజయదశమి శుభ ముహూర్తాన ఈ గ్రాండ్ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారట. ఈ దసరా పండుగ వేళ 'ఆర్సీ 17' అధికారిక ప్రారంభోత్సవంతో అభిమానులకు మేకర్స్ ఒక బిగ్ ట్రీట్ ఇవ్వబోతున్నారు. దసరా నాడు గ్రాండ్‌గా పూర్తి చేసి రెగ్యులర్ షూటింగ్‌ను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పట్టాలెక్కించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి మైత్రీ మూవీ మేకర్స్ మరియు మేకర్స్ ఒక గడువును నిర్దేశించుకున్నారు. సరిగ్గా 12 నెలల్లో షూటింగ్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసి 2027 డిసెంబర్ నాటికి సినిమాను పూర్తి చేయాలనే లక్ష్యంతో సుకుమార్ అండ్ టీమ్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సంగీత దర్శకుడిగా పలువురి పేరులు వినిపిస్తున్నాయి కానీ ఎవరిపేర్లు ఫైనల్ కాలేదు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**